

# ప్రజాస్పూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | ఆదివారం 13-07-2025 | సంపుటి - 24 | సంచిక - 70 | రూ : 4 | పేజీలు: 8




## ట్రంప్ మరో సంచలన నిర్ణయం.. యూరప్ దేశాలే టార్గెట్!

- యూరప్ దేశాలతో పాటు, మెక్సికోపైనా సుంకాలు
- ఆగస్టు 1 నుంచి 30 శాతం సుంకాలు విధిస్తున్నట్టు ట్రంప్ ప్రకటన
- ప్రతీకార సుంకాలు విధిస్తే మరింత ఎక్కువ సుంకాలు విధిస్తామని హెచ్చరిక

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యూరోపియన్ యూనియన్ (ఈయూ) మరియు మెక్సికో నుంచి దిగుమతి అయ్యే అన్ని వస్తువులపై ఈ ఏడాది ఆగస్టు 1 నుంచి 30 శాతం సుంకాలు విధిస్తున్నట్లు ప్రకటించారు. ఈ నిర్ణయం వాణిజ్య ఒప్పందాలలో సమతుల్యత

తరువాయి 2లో

### అధిక శాతం

## వడ్డీ చెల్లింపులు కష్టం అవుతోంది!

సీఎం రేవంత్‌తో పీఎం ఆర్థిక సలహా మండలి చైర్మన్ భేటీ

- తెలంగాణ అభివృద్ధి అంశంపై చర్చ
- సమాఖ్య విధానంలో కేంద్రం, రాష్ట్రాలు పరస్పరం గౌరవించుకోవాలన్న ముఖ్యమంత్రి

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్‌లోని జుబ్లీహిల్స్‌లో గల తన నివాసంలో ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి చైర్మన్ ఎస్. మహేంద్ర దేవ్‌తో సమావేశమయ్యారు. తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్లే అంశంపై ఈ సందర్భంగా వారు చర్చలు జరిపారు. రాష్ట్రాలు అభివృద్ధి చెందితేనే దేశం ముందుకు వెళుతుందని రేవంత్ రెడ్డి అన్నారు. సమాఖ్య

తరువాయి 2లో





### భూమికి తిరిగి వచ్చాక వారం రోజులు

## క్వారంటైన్‌కు శుభాంశు శుక్లా

- ఈ నెల 14న భూమికి తిరిగి రానున్న శుక్లా సహా వ్యోమగాములు
- కాలిఫోర్నియాలో ల్యాండ్ కాగానే క్వారంటైన్‌కు తరలింపు
- వారం రోజుల పాటు వారి ఆరోగ్యం, ఫిట్‌నెస్‌ను పర్యవేక్షించనున్న ఇస్రో వైద్యులు

భారత వ్యోమగామి శుభాంశు శుక్లా భూమికి తిరిగి వచ్చిన అనంతరం వారం రోజుల పాటు క్వారంటైన్‌లో ఉండనున్నారు. యాక్సియమ్ 4 మిషన్‌లో భాగంగా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి (ఐఎస్ఎస్) వెళ్లిన శుభాంశు శుక్లా, ఆయనతో పాటు మరో ముగ్గురు వ్యోమగాములు ఈ నెల 14న భూమికి తిరిగి రానున్నారు. జులై 15న

తరువాయి 2లో

### ఏపీలో 5 నగరాలకు

## కేంద్రం 'స్వచ్ఛ సర్వేక్షణ్' అవార్డులు..

- విశాఖకు 'మినిస్టీరియల్' అవార్డు
- ఈ ఏడాది స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులు ప్రకటించిన కేంద్రం
- విశాఖ, గుంటూరు, విజయవాడ, తిరుపతి, రాజమండ్రి నగరాలకు అవార్డులు
- పరిశుభ్రత అంశంలో అవార్డులు

ఏపీలోని 5 నగరాలు 'స్వచ్ఛ సర్వేక్షణ్' అవార్డులకు ఎంపికయ్యాయి. కేంద్ర ప్రభుత్వం తాజాగా ఈ ఏడాది 'స్వచ్ఛ సర్వేక్షణ్' అవార్డులను ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, తిరుపతి, రాజమండ్రి నగరాలు పరిశుభ్రత విషయంలో ఉత్తమ ప్రదర్శన కనబరిచినందుకు ఈ అవార్డులకు ఎంపికయ్యాయి.

తరువాయి 2లో



### ట్రెండింగ్ పేజీకి

## వీడ్కోలు పలుకుతున్న యూట్యూబ్!

- 2015లో ట్రెండింగ్ పేజీని తీసుకువచ్చిన యూట్యూబ్
- బ్రేకింగ్ న్యూస్, ట్రెండింగ్ వీడియోలను హైలైట్ చేసేందుకు కేంద్రస్థానంలా ట్రెండింగ్ పేజీ
- మారిన యూజర్ల అలవాట్లు
- ట్రెండింగ్ పేజీని మూసివేస్తున్నట్టు యూట్యూబ్ ప్రకటన

ప్రముఖ వీడియో షేరింగ్ ప్లాట్‌ఫామ్ యూట్యూబ్ తన ట్రెండింగ్ పేజీని మూసివేస్తున్నట్లు ప్రకటించింది. 2015లో ప్రారంభమైన ఈ ట్రెండింగ్

తరువాయి 2లో




## విమానం టేకాఫ్ తర్వాత ఇంధన స్విచ్‌లు ఆఫ్!

- అహ్మదాబాద్ విమాన ప్రమాదానికి సంబంధించి కీలక విషయం వెలుగులోకి

2లో



# ఈ నెల 15, 16వ తేదీల్లో సీఎం చంద్రబాబు ఢిల్లీ పర్యటన




- ఢిల్లీలో సీఎం చంద్రబాబు రెండ్రోజుల పర్యటన
- కేంద్రమంత్రులతో భేటీలు
- రాష్ట్రంలో చేపడుతున్న వివిధ ప్రాజెక్టులు, కేంద్ర నిధులపై చర్చ
- ఈ నెల 17న రాష్ట్రానికి తిరిగి రాక

ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు రెండు రోజుల పాటు ఢిల్లీలో పర్యటించనున్నారు. ఈ నెల 15, 16వ తేదీల్లో దేశ రాజధాని ఢిల్లీలో పలువురు కేంద్ర మంత్రులతో భేటీ సహా వేర్వేరు కార్యక్రమాలకు ముఖ్యమంత్రి హాజరుకానున్నారు. రాష్ట్రంలో చేపడుతున్న వివిధ ప్రాజెక్టులు, కేంద్ర నిధులపై సీఎం వారితో చర్చించనున్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, మంత్రులు అశ్వినీ వైష్ణవ్, సీఆర్ పాటిల్, మన్సుఖ్ మాండవీయ, నీతి ఆయోగ్ సభ్యుడు వీకే సారస్వత్ తదితరులతో సీఎం తన ఢిల్లీ పర్యటనలో

తరువాయి 2లో

## ఈ నెల 15, 16వ తేదీల్లో సీఎం చంద్రబాబు ఢిల్లీ పర్యటన

(మొదటిపేజీ తరువాయి)

భేటీ కానున్నారు. రాష్ట్రంలో చేపట్టిన ప్రాజెక్టులు, వాటికి అవసరమైన నిధులు, పోలవరం బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు సహా వేర్వేరు అంశాలపై సీఎం కేంద్ర మంత్రులతో చర్చించనున్నారు. అలాగే గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించిన పనుల గురించి కూడా ఆయా మంత్రిత్వ శాఖతో సీఎం చర్చలు జరుపనున్నారు. జులై 15వ తేదీ ఉదయం అమరావతి నుంచి ఢిల్లీ వెళ్లనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు మధ్యాహ్నం కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో భేటీ కానున్నారు. అదే రోజు కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్, నీతి ఆయోగ్ సభ్యుడు వీకే సారస్వత్, ఢిల్లీ మెట్రో రైల్ ఎండీలతోనూ ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశం కానున్నారు. సాయంత్రం 4.30 గంటలకు ప్రైమ్ మినిస్టర్స్ మ్యూజియం లైబ్రరీలో జరుగనున్న మాజీ ప్రధాని పీవీ నరసింహారావు సంస్మరణ కార్యక్రమంలో పాల్గొని సీఎం ప్రసంగించనున్నారు. జులై 16వ తేదీన కేంద్ర కార్మిక ఉపాధి కల్పనా మంత్రి మన్సుఖ్ మాండవీయతో ముఖ్యమంత్రి సమావేశం కానున్నారు. అనంతరం నార్త్ బ్లాక్ లో కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్, ఆర్థిక శాఖామంత్రి నిర్మలా సీతారామన్ తో ముఖ్యమంత్రి ప్రత్యేకంగా భేటీ కానున్నారు. సాయంత్రం భారత పరిశ్రమల సమాఖ్య నిర్వహించే బిజినెస్ కాన్ఫరెన్స్ కు ముఖ్యమంత్రి హాజరవుతారు. 17వ తేదీ ఉదయం 9.30 గంటలకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీ నుంచి అమరావతి బయలుదేరుతారు.

## ట్రంప్ మరో సంచలన నిర్ణయం.. యూరప్ దేశాలే టార్గెట్!

(మొదటిపేజీ తరువాయి)

సాధించేందుకు మరియు అమెరికా ఆర్థిక ప్రయోజనాలను కాపాడేందుకు తీసుకున్న చర్యగా ట్రంప్ వెల్లడించారు. ఈ ప్రకటన శనివారం నాడు ఆయన తన సొంత సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ట్రూత్ సోషల్‌లో లేఖ రూపంలో విడుదల చేశారు. ట్రంప్ తన లేఖలో, మెక్సికో డ్రగ్ ట్రాఫికింగ్ నియంత్రణలో విఫలమైందని, ముఖ్యంగా ఫెంటానిల్ సంక్షోభానికి కారణమైన కార్టెల్స్‌ను అరికట్టడంలో నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. అలాగే, యూరోపియన్ యూనియన్‌తో వాణిజ్య సంబంధాలు సమానత్వ ప్రాతిపదికన లేవని, దీర్ఘకాలంగా వాణిజ్య లోటు ఉందని, ఇయూ యొక్క సుంకాలు మరియు వాణిజ్య అడ్డంకులు దీనికి కారణమని పేర్కొన్నారు. తాజాగా తాను విధించిన సుంకాలు ఇప్పటికే ఉన్న స్టీల్ వంటి రంగాలకు సంబంధించిన లెవీలకు అదనం అని వివరించారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందాలపై చర్చలు జరుపుతున్న ఈయూ, మెక్సికో దేశాలకు ఆగస్టు 1 వరకు గడువు ఇస్తామని, ఒప్పందాలు కుదిరితే సుంకాల రేట్లు తగ్గే అవకాశం ఉందని ట్రంప్ సూచించారు. అయితే, ఈ దేశాలు ప్రతీకార సుంకాలు విధిస్తే మరింత ఎక్కువ సుంకాలు విధిస్తామని హెచ్చరించారు. ఈయూ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయెన్ ఈ సుంకాలు వాణిజ్య యుద్ధానికి దారితీస్తాయని ఆందోళన వ్యక్తం చేస్తూ, ఆగస్టు 1 లోపు ఒప్పందం కుదుర్చుకునేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ సుంకాలు అమెరికా వినియోగదారులు, వ్యాపారాలపై ప్రభావం చూపే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. గతంలో ట్రంప్ విధించిన సుంకాలు ఆర్థిక మార్కెట్లలో అలజడి సృష్టించాయి.

## అధిక శాతం వడ్డీ చెల్లింపులు కష్టం అవుతోంది!

(మొదటిపేజీ తరువాయి)

విధానంలో కేంద్రం, రాష్ట్రాలు పరస్పరం గౌరవించుకోవాలని ఆయన వ్యాఖ్యానించారు. హైదరాబాద్ నగరంతో పాటు రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలపై దృష్టి సారించినట్లు ముఖ్యమంత్రి ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. హైదరాబాద్ చుట్టూ రీజినల్ రింగ్ రోడ్డు నిర్మిస్తామని తెలిపారు. అనుసంధానంగా రేడియల్ రోడ్లను కూడా నిర్మిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. అదే సమయంలో అధిక వడ్డీలకు తీసుకున్న రుణాలపై ముఖ్యమంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. అధిక వడ్డీల కారణంగా రాష్ట్రాభివృద్ధి కుంటుపడుతోందని, తిరిగి చెల్లించడం కష్టంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వడ్డీలు చెల్లించడానికే అధిక ఆదాయం ఖర్చు చేయవలసి వస్తోందని అన్నారు. అధిక వడ్డీ రేట్లకు తీసుకున్న రుణాలపై వడ్డీ తగ్గించుకునే ప్రయత్నం చేస్తున్నామని ఆయన తెలిపారు.

## భూమికి తిరిగి వచ్చాక వారం రోజులు క్వారంటైన్‌కు శుభాంశు శుక్లా

(మొదటిపేజీ తరువాయి)

కాలిఫోర్నియా తీరంలో వారు ల్యాండ్ కాగానే వారిని ఏడు రోజుల పాటు క్వారంటైన్‌కు తరలించనున్నట్లు అధికారులు తెలిపారు. వ్యోమగాములు అంతరిక్షంలో భారరహిత స్థితిని అనుభవించినందున భూవాతావరణానికి వారి శరీరాలు అలవాటు పడేందుకు వీలుగా ఈ చర్యలు తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. ఇస్రోకు చెందిన వైద్యాధికారులు వారం రోజుల పాటు వ్యోమగాముల ఆరోగ్యం, ఫిట్‌నెస్‌ను నిరంతరం పర్యవేక్షిస్తారు. అంతేకాకుండా, అంతరిక్షంలో వ్యోమగాముల శరీరాలపై పడిన ప్రభావాన్ని కూడా వైద్యాధికారులు అధ్యయనం చేయనున్నారు.

## టీకా కోసం 20 కి.మీ.నడిచిన వృద్ధురాలు

రాయగడ పట్టణం : కుక్కకాటుకు గురైన 92 ఏళ్ల వృద్ధురాలు రేబిస్ టీకా కోసం 20 కిలోమీటర్లు నడిచారు. ఒడిశాలో ఈ దయనీయ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఆ రాష్ట్రంలో ప్రైవేటు వాహనాల డ్రైవర్లు రెండు రోజులుగా సమ్మె బాట పట్టడంతో వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఈ సమ్మె నువాపడ జిల్లా సీనాపల్లి సమితి శికబాహల్ గ్రామానికి చెందిన మంగల్‌బారి మోహరా (92)కు శాపంగా మారింది. ఇటీవల ఆమెను కుక్క కరవడంతో సీనాపల్లి సీహెచ్‌సీలో చికిత్స తీసుకున్నారు. బుధవారం టీకా వేయించుకోవాల్సి ఉంది. సమ్మె కారణంగా ఏ వాహనమూ లేకపోవడంతో తన ఊరి నుంచి 10 కి.మీ. దూరంలోని సీనాపల్లికి కాలినడకన వెళ్లారు. టీకా వేయించుకున్నాక మళ్లీ నడిచే ఇంటికి చేరుకున్నారు.



## ఏపీలో 5 నగరాలకు కేంద్రం 'స్వచ్ఛ సర్వేక్షణ్' అవార్డులు..

(మొదటిపేజీ తరువాయి)

ఇందులో విశాఖ నగరానికి' స్పెషల్ కేటగిరీ మినిస్టీరియల్' అవార్డు దక్కగా... విజయవాడ, గుంటూరు, తిరుపతి నగరాలు 'స్వచ్ఛ సూపర్ లీగ్ సిటీస్' కేటగిరీలో ఎంపికయ్యాయి. రాజమండ్రి నగరం రాష్ట్రస్థాయి మినిస్టీరియల్ అవార్డుకు ఎంపికైంది. స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా నిర్వహించే ఈ సర్వేలో పట్టణాల్లోని పరిశుభ్రత, వ్యర్థాల నిర్వహణ, పౌరుల సహకారం, స్థిరమైన పరిష్కారాలు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకున్నారు. విశాఖపట్నం రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిచినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ నగరాల పౌరులను, స్థానిక సంస్థలను అభినందించింది. స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులు రాష్ట్రంలో పరిశుభ్రతపై అవగాహనను మరింత పెంచేందుకు దోహదపడతాయని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.



## ట్రెండింగ్ పేజీకి వీడ్కోలు పలుకుతున్న యూట్యూబ్!

(మొదటిపేజీ తరువాయి)

పేజీ, వైరల్ వీడియోలు, బ్రేకింగ్ న్యూస్, మరియు టాప్ మ్యూజిక్ రిలీజ్‌లను హైలైట్ చేసేందుకు ఒక కేంద్ర స్థానంగా ఉండేది. దాదాపు దశాబ్ద కాలం పాటు వినియోగదారులకు ట్రెండింగ్ కంటెంట్‌ను అందించిన ఈ ఫీచర్ కు జులై 21 నుంచి అధికారికంగా వీడ్కోలు పలకనున్నారు. ఈ నిర్ణయం వినియోగదారుల వీక్షణ అలవాట్లలో వచ్చిన మార్పులు మరియు ప్లాట్‌ఫామ్ యొక్క అభివృద్ధికి అనుగుణంగా తీసుకున్నామని యూట్యూబ్ వెల్లడించింది. యూట్యూబ్ ట్రెండింగ్ పేజీ ఒకప్పుడు యూజర్లకు ప్లాట్‌ఫామ్‌లో జనాదరణ పొందిన కంటెంట్‌ను తెలుసుకునేందుకు ఓ మెయిన్ డెస్టినేషన్ గా ఉండేది. ఈ పేజీలో వీడియోలు అన్ని వర్గాల నుంచి, ముఖ్యంగా హై క్లిక్ రేట్‌తో ఉన్నవి పొందుపరిచేవారు. అయితే, గత కొన్ని సంవత్సరాలలో వినియోగదారుల అలవాట్లు మారాయి. యూట్యూబ్ అధునాతన రికమెండేషన్ అల్గారిథమ్‌లు హోమ్‌పేజీల ద్వారా ట్రెండింగ్ కంటెంట్‌ను నేరుగా అందిస్తున్నాయి, దీంతో ట్రెండింగ్ పేజీ యొక్క అవసరం తగ్గిపోయింది. వినియోగదారులు ఇప్పుడు షార్ట్స్, కమ్యూనిటీ పోస్ట్‌లు, మరియు సెర్చ్ సజెషన్స్ ద్వారా ట్రెండ్‌లను కనుగొంటున్నారు. ఈ నేపథ్యంలో ట్రెండింగ్ పేజీ స్థానంలో, యూట్యూబ్ చార్ట్స్ మరియు కస్టమైజ్ చేసిన రికమెండేషన్‌లపై దృష్టి సారించనుంది. ఈ చార్ట్స్ విభాగాల వారీగా ట్రెండింగ్ కంటెంట్‌ను అందిస్తాయి. ఇది వినియోగదారులకు మరింత నిర్దిష్టమైన కంటెంట్ డిస్కవరీ అనుభవాన్ని అందిస్తుంది. అదనంగా, క్రియేటర్‌లకు సహాయం చేసేందుకు యూట్యూబ్ స్టూడియోలోని ఇన్‌స్పిరేషన్ ట్యాబ్ వంటి ఫీచర్‌లు కొనసాగుతాయి. ఇవి కొత్త ట్రెండ్‌లను గుర్తించడంలో సహాయపడతాయి. కొత్త క్రియేటర్‌లను ప్రోత్సహించేందుకు 'హైప్' ఫీచర్ వంటి కొత్త టూల్స్‌ను కూడా యూట్యూబ్ పరిచయం చేస్తోంది.

## విమానం టేకాఫ్ తర్వాత ఇంధన స్విచ్‌లు ఆఫ్!

* **ఇంధన స్విచ్‌లు ఎందుకు ఆఫ్ చేశావంటూ మరో పైలట్‌ను ప్రశ్నించిన పైలట్**
* **కాక్‌పిట్‌లో రికార్డయిన చివరి మాటలు ఇవే**
* **ఏఏఐబీ దర్యాప్తు నివేదికలో వెల్లడి**

అహ్మదాబాద్‌లో ఎయిర్ ఇండియా విమాన ప్రమాదానికి సంబంధించి కీలక విషయం ఒకటి వెలుగులోకి వచ్చింది. విమానం టేకాఫ్ అయిన కొన్ని సెకన్లలోనే ఇంధన కంట్రోల్ స్విచ్‌లు ఆగిపోయాయి. వెంటనే అప్రమత్తమైన పైలట్ వాటిని ఎందుకు ఆఫ్ చేశావని మరో పైలట్‌ను ప్రశ్నించాడు. దీనికి తాను ఆఫ్ చేయలేదని అతడు సమాధానమిచ్చాడు. కాక్‌పిట్‌లో పైలట్లు మాట్లాడుకున్న చివరి మాటలు ఇవే. ఆ తర్వాత పైలట్ల నుంచి మేడే కాల్ వచ్చిందని విమాన ప్రమాదంపై దర్యాప్తు జరిపిన 'ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేటింగ్ బ్యూరో' (ఏఏఐబీ) పేర్కొంది. ఈ మేరకు ప్రాథమిక నివేదికను విడుదల చేసింది.. పైలట్లు ఇచ్చిన మేడే కాల్‌కు ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్ స్పందించినప్పటికీ పైలట్ల నుంచి ఎలాంటి స్పందన రాలేదని, ఈలోపే విమానం కూలిపోయిందని ఆ నివేదిక పేర్కొంది. ప్రమాదానికి సంబంధించిన ఫొటోలు, వీడియోల పరిశీలన పూర్తిచేసినట్టు తెలిపింది. అలాగే, విమానానికి సంబంధించిన రెండు ఇంజిన్లను వెలికి తీసినట్టు పేర్కొంది. ప్రమాదానికి ముందు ఇంధనం, బరువు సైతం పరిమితుల్లో ఉన్నాయని వివరించింది. అలాగే, విమానంలో ప్రమాదకర వస్తువులు ఏమీ లేవని ఏఏఐబీ తన నివేదికలో పేర్కొంది.

## భారత్ లో 'ఎక్స్' వినియోగదారులకు గుడ్ న్యూస్

* **సబ్ స్క్రిప్షన్ ధరలతో ఇబ్బంది పడుతున్న ఎక్స్ వినియోగదారులు**
* **కీలక నిర్ణయం తీసుకున్న ఎలాన్ మస్క్**
* **సబ్ స్క్రిప్షన్ ధరలను తగ్గిస్తూ నిర్ణయం**

ప్రపంచ శ్రీమంతుడు ఎలాన్ మస్క్ ట్విట్టర్‌ను కొనుగోలు చేసిన తర్వాత దాని పేరును ఎక్స్ గా మార్చిన సంగతి తెలిసిందే. అంతేకాదు, అప్పటి వరకు ఉచితంగా ఉన్న ట్విట్టర్ బ్లూ టిక్ ఖాతాలకు పెయిడ్ సబ్ స్క్రిప్షన్‌ను తీసుకొచ్చారు. ఈ పెయిడ్ సబ్ స్క్రిప్షన్ తో మన దేశంలో అనేక మంది ఇబ్బంది పడుతున్నారు. ఈ క్రమంలో మస్క్ కీలక నిర్ణయం తీసుకున్నారు. సబ్ స్క్రిప్షన్ ధరలను భారీగా తగ్గించారు. తాజా నిర్ణయం ప్రకారం... నెలకు రూ. 5,130గా ఉన్న ప్రీమియం ప్లస్ సబ్ స్క్రిప్షన్ ధర రూ. 3 వేలకు అందుబాటులోకి రానుంది. రూ. 900గా ఉన్న ప్రీమియం సబ్ స్క్రిప్షన్ ధర రూ. 470కి తగ్గనుంది. యాప్ వర్షన్ లో బేసిక్ ప్లాన్ నెలకు రూ. 244గా ఉన్న ధర రూ. 170కి... ప్రీమియం రూ. 650 నుంచి రూ. 427కి... ప్రీమియం ప్లస్ రూ. 3,470 నుంచి రూ. 2,570కి దిగిరానున్నాయి.



## మయన్మార్ లో బౌద్ధారామంపై వైమానిక దాడి.. పలువురు మృతి

* **మయన్మార్ లో వైమానిక దాడిలో 23 మంది మృతి**
* **అంగ్ సాన్ సూకీ ప్రభుత్వాన్ని కూలగొట్టి, సైన్యం అధికారాన్ని స్వాధీనం చేసుకున్నప్పటి నుంచి అల్లకల్లోలం**

మయన్మార్‌లో విషాదకర ఘటన చోటుచేసుకుంది. సగయింగ్ ప్రాంతంలోని ఒక బౌద్ధారామంపై జరిగిన వైమానిక దాడిలో 23 మంది మృతి చెందగా, 30 మందికి పైగా గాయపడ్డారు. ఈ విషయాన్ని స్థానిక మీడియా వెల్లడించింది. క్షతగాత్రుల్లో పది మంది పరిస్థితి విషమంగా ఉందని ఆన్‌లైన్ మీడియా తెలిపింది. బౌద్ధారామానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి దాదాపు 150 మంది ఆశ్రయం పొందుతున్నారని తిరుగుబాటుదారుల నాయకుడు ఒకరు వెల్లడించారు. అయితే, ఈ దాడులపై అక్కడి మిలటరీ ఇప్పటి వరకు ఎటువంటి ప్రకటనా చేయలేదు. 2021 ఫిబ్రవరిలో అంగ్ సాన్ సూకీ ప్రభుత్వాన్ని కూలదోసి సైన్యం అధికారాన్ని స్వాధీనం చేసుకున్నప్పటి నుంచి మయన్మార్ అల్లకల్లోలంగా ఉంది. ఇది క్రమంగా అంతర్యుద్ధానికి దారితీసింది. శాంతియుత నిరసనలను సైన్యం అణిచివేయడంతో తిరుగుబాటుదారులు ఆయుధాలు చేపట్టారు. దీంతో సైనికులకు, తిరుగుబాటుదారులకు మధ్య ఘర్షణలతో మయన్మార్ అట్టుడుకుతోంది. ఈ నేపథ్యంలో బౌద్ధారామంలో తిరుగుబాటుదారులు తలదాచుకుంటున్నట్లు సమాచారం అందడంతో సైన్యం వైమానిక దాడి చేసినట్లు తెలుస్తోంది.



## చంపేస్తామంటూ కేంద్ర మంత్రికి బెదిరింపులు..!

లోక్ జనశక్తి (రామ్ విలాస్) అధినేత, కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్‌కు హత్యా బెదిరింపులు వచ్చాయి. ఆయన్ని చంపేస్తానంటూ ఓ దుండగుడు సామాజిక మాధ్యమాల్లో పోస్టు పెట్టడం కలకలం సృష్టిస్తుంది. పార్టీ ప్రతినిధి రాజేశ్ భట్ ఎక్స్ వేదికగా ఈ విషయాన్ని వెల్లడించారు. చిరాగ్‌ను హతమారుస్తామంటూ 'టైగర్ మెరాజ్ ఇడిసి' అనే పేరుతో ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు పెట్టారని రాజేశ్ తెలిపారు. పాశ్వాన్‌కు పెరుగుతున్న ప్రజాదరణ కారణంగానే ఈ బెదిరింపులు వచ్చాయన్నారు. దీనిపై పట్నాలోని సైబర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. బెదిరింపు వెనక తీవ్రతను దృష్టిలోపెట్టుకొని పోలీసులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో అభ్యర్థించినట్లు తెలిపారు. ఈసందర్భంగా దుండగుడిని వెంటనే పట్టుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కాగా.. ఈ ఏడాది చివర్లో బిహార్‌లో ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో తాను పోటీ చేస్తానని ఇటీవల పాశ్వాన్ ప్రకటించారు.

# పోరువద్దు ఊరు ముద్దు"

* **మావోయిస్టు పార్టీని వీడి జనజీవన స్రవంతిలో కలవండి అభివృద్ధిలో భాగస్వాములవ్వండి : ఎస్పీ రోహిత్ రాజు**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసులు , 81,141, సిఆర్పిఎఫ్ బెటాలియన్లు, 204 కోబ్రా అధికారులు ఆదివాసీ ప్రజల అభివృద్ధి సంక్షేమం కొరకు నిర్వహిస్తున్న "ఆపరేషన్ చేయూతే" కార్యక్రమం ద్వారా లొంగిపోయిన సభ్యులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు శాఖ కల్పిస్తున్న సదుపాయల గురించి తెలుసుకుని నక్సలిజాన్ని విడనాడి ఇకపై తాము కూడా కుటుంబ సభ్యులతో కలిసి కలిసి ప్రశాంతమైన జీవితం గడపాలని నిర్ణయించుకొని వివిధ స్థాయిలలో పనిచేస్తున్న (6) మంది నిషేదిత మావోయిస్టు పార్టీ సభ్యులు, (ఇద్దరు మహిళ) సభ్యులు శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఎదుట లొంగిపోయారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోఈ సంవత్సరం జనవరి2025 నుండి అప్పటివరకు వీరితో కలిపి 300 మంది మవోయిస్టు దళ సభ్యులు వివిధ హోదాలలో జనజీవన స్రవంతిలో కలిసి తగిన పునరావాస సౌకర్యాలను పొందడం జరిగింది. క్షీణదలలో ఉన్న మావోయిస్టు పార్టీ భవిష్యత్తును చూసి, క్రిందిస్థాయి క్యాడర్లపై స్థాయి క్యాడర్ల ఆదేశాలను వ్యతిరేకించి, రహస్య ఉద్యమ జీవితం నుండి బయటకు వచ్చి తమ తమ గ్రామాలకు వెళ్లి కుటుంబాలతో కలిసి ప్రశాంతమైన జీవితాన్ని గడపాలని కోరుకుంటున్నారు. ఈ సంవత్సరం ఇప్పటివరకు 300 మంది సాయుధ దళ సభ్యులు కేవలం ఒక్క భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనే జనజీవన స్రవంతిలో కలిసి తమె కుటుంబాలతో శాంతియుత జీవనం గడుపుతున్నారు.అడవుల్లో ఉన్న ఆదివాసీ గ్రామాల ప్రజలు మావోయిస్టు పార్టీకి సహకరించుకపోవడం వలన చివరికి ఆహార పదార్థాలు కూడా లభించకపోవడంతో అన్ని స్థాయిల్లో ఉన్న క్యాడర్ల ఆరోగ్యం క్షీణించిందని, ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతంకు నడిచి వెళ్లి శక్తి కూడా లేదని తెలుస్తుంది. 90శాతం పైగా క్యాడర్లు నిరుపేద ఆదివాసీలు, తన కుటులు అభివృద్ధి ముఖ్యమని తలచి పార్టీని వీడి జనజీవన స్రవంతిలో కలుస్తున్నారు. ఇది చాలా శుభపరిణామం.దళాలలో పనిచేస్తున్న మిగతా క్యాడర్లందరూ పార్టీని వీడి జనజీవన స్రవంతిలో కలవండి. "పోదు వద్దు ముద్దు' అనే నినాదాన్ని నమ్మి వచ్చి ఇప్పటివరకు ఈ సంవత్సరం 2025 లో, జనజీవన స్రవంతిలో కలిసిన వివిధ స్థాయిలలో గల 300 మంది సాయుధ దళసభ్యులకు సుమారుగా (58) సహాయంగా అందించడమైనది మిగతా నగదును వారి ర్యాంకుల వారిగా ఆధార్ అర్డులు , బ్యాంక్ అకౌంట్స్ వచ్చిన తర్వాత వారి యొక్క బ్యాంకు ఖాతాలలో చెక్కుల రూపంలో చేయబడును. శనివారం లొంగిపోయిన 6 నుంచి మావోయిస్టు దళసభ్యలకు తక్షణ సహాయంగా ప్రతి ఒక్కరికి 25వేల రూపాయల చొప్పున మొత్తం 1,50,000/రూపాయల నగదును ఇవ్వడం జరుగుతుంది. తదుపరి వారి ర్యాంకుల వారిగా మిగతా నగదును ఆధార్ కార్డులు మరియు ట్యాంక్ అకౌంట్స్ వచ్చిన తర్వాత వారి బ్యాంకు ఖాతాలలో మొత్తం 10,75,000 చెక్కుల రూపంలో చేయబడును.తెలంగాణ ప్రభుత్వం ఆదివాసీల అభివృద్ధి సంక్షేమం పట్ల ఎంతో సానుకూలంగా స్పందిస్తుంది. పోలీసు శాఖ కూడా తని వంతు కృషి చేస్తుంది. కర్రెగుట్టలలో గల అటవీ సంపదను రక్షించడానికి ఆ సంపదను ఆదివాసీలు స్వేచ్ఛగా ఉపయోగించుకోవడానికి కావలసిన పోలీసు క్యాంపులను శేంద్ర బలగాలు ఏర్పాటు చేయబోతున్నాయి. ఆదివాసీ ప్రజలకు విజ్ఞప్తి, మీరు సమ్మకంతోనే లేదా భయంతోనే మావోయిస్టు పార్టీకి ఎంత సహకరించినా మీ ఆదివాసి ప్రాంతాలు అభివృద్ధికి నోచుకోవు. కేవలం ప్రజాస్వామ్య ప్రభుత్వాల ద్వారా మాత్రమే అభివృద్ధి జరుగుతుంది. అభివృద్ధితో కూడిన ప్రజల శాంతియుత జీవనం మా పోలీసుల నినాదం పోరువద్దు ఊరు ముద్దు,మావోయిస్టు పార్టీని వీడి జనజీవన స్రవంతిలో కలవండి.. అభివృద్ధిలో భాగస్వాములవ్వండి పిలుపునిచ్చారు.

## హర్షం ప్రకటించిన బీసీ టీచర్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్ : బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలుకు నిర్ణయం తీసుకోవడం పట్ల బహుజన క్లాస్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్లమ్మల లక్ష్మణ్ గౌడ్ హర్షం ప్రకటించారు.శనివారం ముస్తాబాద్‌లో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ విప్లవత్మకమైన నిర్ణయం తీసుకోవడం చారిత్రాత్మక పరిణామమని అన్నారు. 42 శాతం రిజర్వేషన్ అమలు బీసీలు అభివృద్ధికి ముందడుగుగా చెప్పుకోవచ్చని, బీసీలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలంటే రిజర్వేషన్ అనేది అత్యవసరమని తెలిపారు. బీసీలు రాజ్యాధికారం పొందితేనే తప్ప వారు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని తెలిపారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో బిసిటిఏ రాష్ట్ర కార్యదర్శి బండారు మల్లేశం, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇటకాల సుధాకర్, మండల అధ్యక్షులు కాలేరు రాజన్న, డి.రాజు, పి.అంజయ్య, శ్రీనివాస్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్:ముస్తాబాద్ మండలంలోని చిప్పలపల్లి గ్రామంలోని రోడ్డు పక్కన ఉన్న చెట్టుకు పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన బచ్చు చౌదరి (33) ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని ముస్తాబాద్ ఎస్ఐ సిహెచ్.గణేష్ తెలిపారు. 10 రోజుల క్రితం మేస్త్రీ పనుల గురించి మండలంలోని చీకోడు గ్రామానికి తన గ్రామానికి చెందిన వ్యక్తులతో వచ్చి చిప్పలపల్లి గ్రామంలో మేస్త్రీ పనులు చేసుకుంటూ తన కుటుంబ సమస్యల గురించి బాధ పడుతూ ఈ నెల 11న రాత్రి చిప్పలపల్లిలోని రోడ్డు పక్కన ఉన్న చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. ఈ మేరకు అతనితోపాటు కలిసి వచ్చిన స్నేహితుడు బిష్ణు చౌదరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



### క్రమశిక్షణతో కూడిన విద్య

## పిల్లల భవిష్యత్తుకు బంగారు బాటలు

* **పేట్ బషీరాబాద్ సిఐ విజయవర్ధన్**

కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : క్రమశిక్షణతో కూడిన విద్య పిల్లల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తుందని పేట్ బషీరాబాద్ సిఐ విజయవర్ధన్ అన్నారు. సుభాష్ నగర్ డివిజన్ పరిధిలోని భాగ్య లక్ష్మీ కాలనీలో గల నేతాజీ హైస్కూల్ లో ఇన్వెస్టిచర్ (పదవి స్వీకార వేడుకలు ) శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పేట్ బషీరాబాద్ సిఐ విజయవర్ధన్ , అజుడ హాస్పిటల్ డాక్టర్ భరత్ కాంత్ రెడ్డి లు ముఖ్యఅతిథులుగా హాజరై నూతనంగా ఎన్నికైన స్కూల్ కెప్టెన్ నవనీత్, వైస్ కెప్టెన్ షగూన్ లో బాధ్యతలు స్వీకరించారు. అదే విధంగా స్పందన గ్రూప్ కెప్టెన్ గా మౌనిక, స్పృహ గ్రూప్ కెప్టెన్ గా మహాలక్ష్మి, చైతన్య గ్రూప్ కెప్టెన్ గా రాకేష్ , స్ఫూర్తి గ్రూప్ కెప్టెన్ గా దేవీ శ్రీ లతో పాటు ఇతర క్లబ్ కెప్టెన్లు బాధ్యతలు స్వీకరించారు. అనంతరం పదవి స్వీకారం చేపట్టిన విద్యార్థులను వారు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో



పాటు అన్ని రంగాలలో రాణించాలన్నారు. అనంతరం నూతనంగా పాఠశాలలో చేరిన విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో చైర్మన్ శివయ్య, వరప్రసాద్, వైస్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, జనరల్ సెక్రటరీ రవికుమార్, పాఠశాల కరస్పాండెంట్ చింతల మహేష్ కుమార్ ,అకాడమిక్ డైరెక్టర్ నందిని, పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులలో నాణ్యత లోపిస్తే ఉరుకునేది లేదు

* **నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డు ను పరిశీలించిన కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్**



శేరిలింగంపల్లి, ( ప్రజాస్ఫూర్తి) : అభివృద్ధి పనులలో నాణ్యత లోపిస్తే ఉరుకునేది లేదని ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్ అన్నారు. ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని దత్తత్రయ కాలనీ సాయిబాబా టెంపుల్ వద్ద నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డు పనులను డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ రోడ్డుకు ఇరువైపులా అంచుల వద్ద మట్టి వేయాలని, మంచిగా క్యూరింగ్ చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. కార్యక్రమంలో శివరాజ్ గౌడ్, బ్రహ్మానంద గౌడ్, పి.ఎల్ ప్రసాద్, పోశెట్టిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉప ముఖ్యమంత్రి పిఆర్ఓ రామకృష్ణను పరామర్శించిన ఎంపీ చామల, ఎమ్మెల్యే అయిలయ్య



యాదగిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి యాదగిరిగుట్ట లోని తన నివాసంలో విశ్రాంతి పొందుతున్న ఉప ముఖ్యమంత్రి పిఆర్వో దుడుక రామకృష్ణను శనివారం భువనగిరి పార్లమెంటు సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యలు పరామర్శించారు. రోడ్డు ప్రమాద సంఘటనకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. త్వరగా ఆరోగ్యంగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వారి వెంట పిసిసి ప్రధాన కార్యదర్శి జనగామ ఉపేందర్ రెడ్డి, పిసిసి సభ్యులు తంగేళ్లపల్లి రవికుమార్, యాదగిరిగుట్ట పట్టణ అధ్యక్షుడు బంధారపు బిక్షపతి, మాజీ కౌన్సిలర్ ముక్యర్ల మల్లేష్, మాజీ ఉపసర్పంచ్ గుండ్లపల్లి భరత్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు పాండవుల సత్య ప్రకాష్, కళ్యెం జహంగీర్, ఇంజ నరేష్, ప్రశాంత్, కోల కృష్ణ తదితరులు ఉన్నారు..

## బిల్లు రాష్ట్రపతి వద్ద పెండింగ్ లో ఉంది.. రేవంత్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోంది

బీసీలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరోసారి మోసం చేస్తున్నారని బీజేపీ రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చేందుకు కేబినెట్ మీటింగ్ లో తీర్మానం చేయడమంటే బీసీలను మరోసారి మోసగించడమేనని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం పంపించిన బిల్లు రాష్ట్రపతి వద్ద పెండింగ్ లో ఉందని... ఆ బిల్లుపై ఏమీ తేల్చకుండా ఆర్డినెన్స్ తీసుకురావడంలో ఉన్న మతలబు ఏమిటని ప్రశ్నించారు. రాష్ట్రపతి వద్ద 42 శాతం రిజర్వేషన్ కు సంబంధించిన బిల్లు పెండింగ్ లో ఉన్నప్పుడు ఆర్డినెన్స్ తీసుకొస్తే... ఆ ఆర్డినెన్స్ కి గవర్నర్ ఎలా ఆమోదం తెలుపుతారని అన్నారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రిజర్వేషన్లలో వివిధ కులాలకు సంబంధించిన గణాంకాలను రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు బయటపెట్టడం లేదని ప్రశ్నించారు. జనాభా గణాంకాలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేస్తే కోర్టులో రాష్ట్ర ప్రభుత్వ వాదన నిలబడే అవకాశం ఉంటుందని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన బుర్ర వెంకటేశం ఆధ్వర్యంలోని కమిషన్ బాధ్యతలను ఎందుకు సక్రమంగా నిర్వర్తించలేదని ప్రశ్నించారు.





# అన్నదాతలకు బాసటగా మంత్రి తుమ్మల

* **ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గోదావరి జలాల పరవళ్ళు**
* **సాగునీరు లేక ఎండుతున్న పంటలు**
* **సాగర్ నీటి విడుదలకు కొంతమేర ఆలస్యం**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: రాష్ట్ర వ్యవసాయ శాఖ మాత్యులు తుమ్మల నాగేశ్వరరావు అన్నదాతలకు బాసటగా నిలుస్తున్నారు. శనివారం ఉమ్మడి ఖమ్మం జిల్లా సీతారామ ప్రాజెక్ట్ ద్వారా బిజీ కొత్తూరు వద్ద మొదటి పంపు నుంచి సాగర్ ఆయకట్టుకు నీరు విడుదల చేయించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సాగునీరు అందక నారుమల్లు, పొలాలకు ఎండిపోతున్న తరుణంలో పంటలకు గోదావరి నీరు విడుదల చేయించి రైతన్నలకు కొండంత భరోసాగా నిలిచారు.

* **రైతుల, ప్రజాప్రతినిధుల విజ్ఞప్తితో....**

జిల్లాలో వర్షాలు సకాలం లో పడక సాగు నీరు లేక పంటలు ఎండి పోతున్నాయని రైతులు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లారు. రైతుల విజ్ఞప్తితో రంగంలోకి దిగిన మంత్రి తుమ్మల రైతాంగాన్ని ఆదుకునేందుకు గోదావరి జలాలు విడుదల చేయాలని నిర్ణయించారు. నిర్ణయమే తరువాయిగా సీతారామ ప్రాజెక్టు నుంచి నీటినీ ఉమ్మడి ఖమ్మంలోని జిల్లా నాగార్జునసాగర్ ఆయకట్టుకు విడుదలపై నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తముమార్ రెడ్డి, కలెక్టర్లతో తుమ్మల మాట్లాడారు. ప్రస్తుతం వర్షాలు లేక, సాగర్ నీరు రాక వరి నారుమళ్లు, పొలాలు ఎండిపోతున్నాయని నాగార్జున సాగర్ నుంచి నీటి విడుదల ఆలస్యమవుతోందని, సీతారామ ప్రాజెక్టు నుంచి విడుదలకు నిర్ణయం తీసుకోవాలని మంత్రి ఉత్తమ్ కుమార్ కు మంత్రి తుమ్మల సూచించారు. వెనువెంటనే విద్యుత్ శాఖ అధికారులు, ఖమ్మం, భద్రాద్రి జిల్లా కలెక్టర్లతోనూ మంత్రి తుమ్మల మాట్లాడారు. రైతంగ అవసరాలు దృష్ట్యా రైతులను ఆదుకునేందుకు తక్షణమే నీటి విడుదలకు కాంగ్రెస్ సర్కార్ నిర్ణయం తీసుకుంది.

* **పంటలకు ఊపిరి పోసిన మంత్రి తుమ్మల...**

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో నాగార్జున సాగర్ ఆయకట్టు పరిధిలో వైరా, సత్తుపల్లి,వర్షదారం మీద ఆధారపడిన అశ్వరావుపేట, కొత్తగూడెం ,పినపాక నియోజకవర్గాల పరిధిలోని లక్షలాది ఎకరాలకు గోదావరి జలాలు అందించి రైతులకు మంత్రి తుమ్మల ఊపిరి పోశారు. లక్షలాది ఎకరాలలో పంటలు సాగు చేసి, నారుమల్లు పోసి వర్షాలు, సాగర జలాల కోసం చూస్తున్న రైతులకు సాగర్ నీరు కొంత ఆలస్యం అయ్యే అవకాశం ఉన్న నేపద్యంలో రైతులు ఆందోళన చెందారు. మంత్రి తుమ్మలకు సమస్యను వివరించారు. నీరు లేకుంటే పంటలు నిలువునా ఎండిపోతాయని తమ ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే స్పందించిన మంత్రి తుమ్మల ఆయకట్టు పరిధిలో రైతులకు నీరు అందించి ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. చెప్పిన వెంటనే ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి నీరు విడుదల చేయించి...రైతన్నల ఆప్తమిత్రుడిగా చెరగని ముద్ర వేశారు. మంత్రి తుమ్మల అనూహ్య నిర్ణయంతో అన్నదాతలు ఊపిరి పీల్చుకున్నారు. మంత్రి చేసిన కృషికి మంత్రి తుమ్మలకు రైతన్నలు జేజేలు పలుకుతున్నారు.

* **జిల్లా సస్యశ్యామలమే తుమ్మల లక్ష్యం...**

ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేయడమే లక్ష్యంగా మంత్రి తుమ్మల కీలక అడుగులు వేస్తున్నారు. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ , సీతమ్మ సాగర్ లతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గోదావరి జలాలు తీసుకొచ్చేందుకు విశేష కృషి చేశారు. సీతారామ ప్రాజెక్టు ఆది నుంచి పూర్తి చేసేలా అహర్నిశలు శ్రమించారు. అన్నదాతలు ఇబ్బందుల్లో ఉన్నారనే మాట వినగానే ప్రభుత్వం యంత్రాంగాన్ని మొత్తం కదిలించి రైతులకు నిరంధించేలా చొరవ చూపారు. ఈ కార్యక్రమంలో వైరా శాసనసభ్యులు రాందాస్ నాయక్, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ రోహిత్ రాజు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, సీతారామ ప్రాజెక్టు ఎస్ ఈ శ్రీనివాస్ రెడ్డి, ఎన్ పి డీసీఎల్ ఎస్సీ మహేందర్, జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు, ఆర్ అండ్ బి ఈఈ వెంకటేశ్వరరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని జయలక్ష్మి, సిపిఓ సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

# ఆ సమయంలో కవిత తీహార్ జైల్లో ఉన్నారు.. పోరాటం ఎప్పుడు చేశారు?

* టీపీసీసీ చీఫ్ ప్రశ్న
* బీసీ రిజర్వేషన్ల పెంపు క్రెడిట్‌ను కవిత తీసుకోవడంపై మహేశ్ కుమార్ గౌడ్ విమర్శలు
* రిజర్వేషన్ల పెంపు ప్రక్రియను చేపట్టినప్పుడు కవిత జైల్లో ఉన్నారన్న టీపీసీసీ చీఫ్
* అసలు కవిత ఇప్పుడు ఏ పార్టీలో ఉన్నారో చెప్పాలని నిలదీత




బీసీ రిజర్వేషన్ల పెంపు ప్రక్రియను తాము చేపట్టిన సమయంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత జైలులో ఉన్నారని, ఆమె ఎప్పుడు పోరాటం చేశారని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ విమర్శించారు. బీసీ రిజర్వేషన్ల పెంపు క్రెడిట్‌ను కవిత తీసుకోవడంపై టీపీసీసీ చీఫ్ స్పందించారు. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ బీసీలకు రిజర్వేషన్ల పెంపు అంశంపై ఎప్పుడూ దృష్టి పెట్టలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సాధించిన రిజర్వేషన్ల పెంపును కవిత తన విజయంగా చెప్పుకోవడం హాస్యాస్పదమని అన్నారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై ఆమె చెబుతున్న మాటలు విని తెలంగాణ సమాజం నవ్వుకుంటోందని ఎద్దేవా చేశారు. తీహార్ జైల్లో ఉన్న కవిత బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం ఎప్పుడు పోరాటం చేశారని నిలదీశారు. అసలు కవిత ఇప్పుడు ఏ పార్టీలో ఉన్నారో చెప్పాలని ప్రశ్నించారు. కుల సర్వే, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో తీసుకున్న విప్లవాత్మక నిర్ణయాలని అన్నారు. ఇలాంటి నిర్ణయాలని అభినందించేందుకు కూడా కేసీఆర్‌కు మనసు రావడం లేదని విమర్శించారు. గతంలో ఎన్నో బిల్లుల విషయంలో బీఆర్ఎస్ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి మద్దతు పలికిందని తెలిపారు. కానీ బీసీలకు మేలు జరిగే ఈ నిర్ణయంపై మాత్రం నోరు మెదపడం లేదని విమర్శించారు. కడుపునిండా విషం పెట్టుకొని కౌగిలించుకొన్నట్లుగా విపక్షాల ధోరణి ఉందని అన్నారు.

## కె. కేశవరావు ఏం మాట్లాడుతున్నారో.. కాంగ్రెస్‌లోకి వెళ్లాకే అలా తయారయ్యారు: శ్రీనివాస్ గౌడ్

* బీసీ రిజర్వేషన్ల అంశంపై స్పందించిన శ్రీనివాస్ గౌడ్
* విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ల కోసం ఆర్డినెన్స్ ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్న
* ప్రభుత్వం తప్పు చేస్తున్నా సహకరించాలా అని నిలదీత



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కె. కేశవరావు ఏం మాట్లాడుతున్నారో అర్థం కావడం లేదని, కాంగ్రెస్ పార్టీలోకి వెళ్ళాకే ఆయన అలా తయారయ్యారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత శ్రీనివాస్ గౌడ్ అన్నారు. బీసీ రిజర్వేషన్ల ఆర్డినెన్సు వ్యవహారంలో బీఆర్ఎస్ నాయకులకు అవగాహన లేదని కాంగ్రెస్ నేతలు చేసిన వ్యాఖ్యలపై ఆయన తీవ్రంగా స్పందించారు. విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ల కోసం ఆర్డినెన్సు ఎందుకు ఇవ్వడం లేదని శ్రీనివాస్ గౌడ్ ప్రశ్నించారు. ఎలాంటి చిక్కులు లేకుండా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని బీఆర్ఎస్ మొదటి నుండి డిమాండ్ చేస్తోందని అన్నారు. ఈ అంశంపై కేశవరావు ఏమి మాట్లాడుతున్నారో అర్థం కావడం లేదని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ నేతలను ఏమీ అనలేక ఆయన బీఆర్ఎస్ నేతలను విమర్శిస్తున్నట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. బీసీ రిజర్వేషన్ అంశంపై ప్రభుత్వానికి సహకరించాలని కె. కేశవరావు చెబుతున్నారని, కానీ తప్పు చేస్తుంటే కూడా సహకరించాలా? అని ఆయన ప్రశ్నించారు.

## నెల రోజుల పాటు సెలవులో వీసీ సజ్జనార్!

* రవాణా శాఖ ప్రత్యేక కార్యదర్శి సురేంద్ర మోహన్‌కు తాత్కాలిక బాధ్యతలు
* 2021 నుండి టీజీఎస్ఆర్టీసీ ఎండీగా సజ్జనార్



వ్యక్తిగత కారణాలతో సెలవులకు సజ్జనార్

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్‌కు రాష్ట్ర ప్రభుత్వం నెల రోజులు పాటు సెలవులు మంజూరు చేసింది. సజ్జనార్ సెలవుల్లో ఉండనున్న ఈ నెల రోజులు టీజీఎస్ఆర్టీసీ ఇన్‌ఛార్జ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సురేంద్ర మోహన్ వ్యవహరించనున్నారని తెలుస్తోంది. సజ్జనార్ 2021 నుండి టీజీఎస్ఆర్టీసీ ఎండీగా కొనసాగుతున్నారు. ఆర్టీసీని ఆర్థిక స్థిరత్వం దిశగా నడిపించడంతో పాటు ఉద్యోగుల సంక్షేమం, ప్రయాణికుల సౌకర్యార్థం ఆయన అనేక చర్యలు తీసుకున్నారు. ఈ నేపథ్యంలో ఆయన సెలవులపై వెళ్లడం చర్చనీయాంశంగా మారింది. ఆయన వ్యక్తిగత కారణాలతో సెలవులు తీసుకున్నట్లు తెలుస్తోంది.

## బీసీ రిజర్వేషన్లు అంశం.. కాంగ్రెస్ ప్రభుత్వంపై పాయల్ శంకర్ విమర్శలు

* బీసీ రిజర్వేషన్లకు మతపరమైన అంశాన్ని జోడించారని విమర్శలు
* మతపరమైన రిజర్వేషన్లను రాజ్యాంగం, సుప్రీంకోర్టు అంగీకరించవని వెల్లడి
* కాంగ్రెస్ ఎప్పుడూ మాట మీద నిలబడలేదన్న పాయల్ శంకర్



బీసీ రిజర్వేషన్లకు మతపరమైన అంశాన్ని జోడించారని, మతపరమైన రిజర్వేషన్లను రాజ్యాంగం, సుప్రీంకోర్టు అంగీకరించవని బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వం హడావుడి చూస్తుంటే బీసీలను మోసం చేస్తున్నదనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఆర్డినెన్సు తీసుకురాకుండానే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేసినట్లు ఆ పార్టీ నేతలు మాట్లాడుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ ఇచ్చిన మాట మీద నిలబడలేదని ఆయన మండిపడ్డారు. శాసనసభ సమావేశాలను ఏర్పాటు చేసి బీసీ రిజర్వేషన్లను ఏ విధంగా అమలు చేస్తారో చర్చించాలని పాయల్ శంకర్ డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంలో న్యాయపరమైన ఇబ్బందులు రాకుండా, బీసీలకు అన్యాయం జరగకుండా ఇచ్చిన మాటకు కట్టుబడాలని ఆయన సూచించారు.

## 136 ఏళ్ల సింగరేణి చరిత్రలో తొలిసారి మహిళా రెస్క్యూ బృందం

* తొలి మహిళా రెస్క్యూ బృందంగా శిక్షణ పొందిన 13 మంది అమ్మాయిలు
* విపత్కర పరిస్థితుల్లో సేవలు అందించేలా 14 రోజుల పాటు శిక్షణ
* ధ్రువీకరణ పత్రాలను అందుకున్న మహిళా రెస్క్యూ టీమ్

136 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర కలిగిన సింగరేణిలో పలువురు మహిళలు తొలి మహిళా రెస్క్యూ బృందంగా శిక్షణ పొందారు. సింగరేణిలో ఎటువంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా సేవలు అందించేలా ఈ మహిళలు సన్నద్ధమయ్యారు. బొగ్గు బావిలోకి నీరు వచ్చినా, విషవాయువు వ్యాపించినా, లేదా ఇతర విపత్కర పరిస్థితులు తలెత్తినా వీరు సేవలు అందించనున్నారు. 13 మంది యువతులకు సింగరేణి యాజమాన్యం శిక్షణ ఇచ్చింది. వీరు 14 రోజుల పాటు కఠోర శిక్షణ పొందారు.

## కాంట్రాక్ట్ కార్మికులకు పెనాల్టీ విధించవద్దు..

* సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం కొత్తగూడెం బ్రాంచ్ నాయకులు భూక్యా రమేష్
* సింగరేణి సివిల్ జీఎం కి వినతి పత్రం అందజేసిన సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం సిఐటియు నాయకులు.

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం,: సింగరేణి సివిల్ జీఎం కార్యాలయంలో వినతి పత్రం అందజేసిన అనంతరం సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం కొత్తగూడెం బ్రాంచ్ నాయకులు భూక్య రమేష్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా అఖిల భారత కార్మిక సంఘాలు నిర్వహించిన సార్వత్రిక సమ్మెలో కార్మిక వర్గానికి నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని ప్రధాన డిమాండ్ తో సమ్మెలోకి దిగిన దేశవ్యాప్త కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపులో భాగంగా సింగరేణి కాంట్రాక్టు కార్మికులు కూడా ఈ సమ్మెలో పాల్గొని తమ నిరసనను స్వచ్ఛందంగా తెలియజేశారనీ, చట్టబద్ధంగా సింగరేణి యాజమాన్యానికి సంబంధిత అధికారులకు 14 రోజుల ముందు సమ్మె నోటీసులు అందజేయడం జరిగిందని వారన్నారు. అయినప్పటికీ ఉద్దేశపూర్వకంగా జులై 9న జరిగిన సమ్మెలో పాల్గొన్న కాంట్రాక్టు కార్మికుల కు జీతం చెల్లించకుండా ఒక్కరోజు జీతాన్ని కట్ చేసి కాంట్రాక్టర్లు ఇబ్బందుల పాలు చేసే అవకాశం ఉందని వారన్నారు. సింగరేణి యాజమాన్యం రూల్స్ ప్రకారం లేబర్ చట్టం ప్రకారం నో వర్క్ నో పే పద్ధతిని పాటించి చట్టబద్ధమైన సమ్మెలో పాల్గొన్న కార్మికులకు ఆరోజు కూడా జీతం చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు . ఈ సందర్భంగా కొత్తగూడెం సివిల్ జీఎం కార్యాలయంలో సిఐటియు నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం కొత్తగూడెం బ్రాంచ్ నాయకులు గూగులోత్ సక్రాం,రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## విదేశీ డిగ్రీలతో అప్పులపాలు కావొద్దు: సీజేఐ గవాయ్

* హైదరాబాదులోని నల్సార్ లా యూనివర్సిటీ 22వ స్నాతకోత్సవం
* ముఖ్య అతిథిగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్
* విదేశీ డిగ్రీలు ప్రతిభను పెంచుతాయనేది అపోహ మాత్రమేనని వెల్లడి
* భారతదేశం నాణ్యమైన న్యాయ విద్యను అందిస్తుందని ఉద్ఘాటన



హైదరాబాద్‌లోని నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం 22వ స్నాతకోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ బి.ఆర్. గవాయ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.ఎస్. నరసింహ, తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, నల్సార్ యూనివర్సిటీ ఛాన్సలర్ జస్టిస్ సుజయ్ పాల్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సీజేఐ గవాయ్ తన ప్రసంగంలో న్యాయరంగంలోకి ప్రవేశిస్తున్న యువ న్యాయవాదులకు మరియు విద్యార్థులకు కీలక సలహాలు ఇచ్చారు. విదేశీ డిగ్రీల కోసం అప్పులు చేయవద్దని న్యాయ విద్యార్థులను మరియు వారి కుటుంబాలను ఆయన హెచ్చరించారు, భారతదేశం నాణ్యమైన న్యాయ విద్యను అందిస్తుందని నొక్కి చెప్పారు. విదేశీ డిగ్రీలు ప్రతిభను పెంచుతాయనేది అపోహ అని, ఒకరి ప్రతిభ వారి పని ద్వారా నిరూపించుకోవాలని ఆయన అన్నారు. విదేశీ డిగ్రీల కోసం కుటుంబాలపై అప్పుల భారం మోపవద్దని ఆయన సూచించారు. న్యాయ వృత్తిలో అంకితభావం మరియు ప్రజాసేవ యొక్క ప్రాముఖ్యతను కూడా ఆయన నొక్కి చెప్పారు. ఇక, నేడు న్యాయవ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్లను కూడా సీజేఐ గవాయ్ తన ప్రసంగంలో హైలైట్ చేశారు, భారతదేశం వివిధ న్యాయపరమైన సవాళ్లను ఎదుర్కొంటుందని, న్యాయవాదులు మరియు న్యాయసేవలో ఉన్నవారు అందరి మాటలను జాగ్రత్తగా వినడం చాలా ముఖ్యం అని పేర్కొన్నారు. న్యాయవ్యవస్థలో కృత్రిమ మేధస్సు (ఏఐ)ని ఉపయోగించుకోవాల్సిన సమయం ఆసన్నమైందని, దీనిని సరిగ్గా ఉపయోగించుకుంటే తీర్పులను వేగంగా అందించడంలో సహాయపడుతుందని సీజేఐ తెలిపారు.

### బీసీలను మరోసారి..
## మోసం చేసేందుకు కొత్త డ్రామాకు తెరలేపిన కాంగ్రెస్ ప్రభుత్వం



రాజాపేట, ప్రజా స్ఫూర్తి : ఆర్డినెన్స్ పేరుతో బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త డ్రామాకు తెరలేపిందని రాజపేట మండలం టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సట్టు తిరుమలేష్ ఆరోపించారు. రాజపేట మండల టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సట్టు తిరుమలేష్ అధ్యక్షతన ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బీసీలను అణగదొక్కే ప్రయత్నం చేస్తూ ఓసీల సంఖ్యను పెంచుకోవడం జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను ఒక ఆట వస్తువుగా పరిగణిస్తున్నారన్నారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ సెక్రటరీ సంధిల భాస్కర్ గౌడ్, తాజా మాజీ జెడ్పిటిసి చామకూర గోపాల్ గౌడ్, యువజన అధ్యక్షుడు పల్లె సంతోష్ గౌడ్, జలసాధన సమితి అధ్యక్షులు ఎర్రగోకుల జశ్వంత్, బీసీ సంఘం మండల నాయకులు గోపగాని యాదగిరి గౌడ్, మాజీ సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షులు బొంగోని ఉప్పలయ్య గౌడ్, పట్టణ అధ్యక్షుడు బెడిదే వీరేశం, ఆత్మ డివిజన్ అధ్యక్షులు మేక వెంకటేశ్వర్ రెడ్డి, మహేంద్ర యువసేన మండల అధ్యక్షుడు బిళ్ళకుదురు రాజు పిఎసిఎస్ డైరెక్టర్ మరల నాగరాజు, సీనియర్ నాయకులు అంకతి సుదర్శన్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కొమ్ము పాండ్, కర్రె కనకయ్య,గంధ మల్ల సురేష్, యువ నాయకులు వరివడ్ల బాలకృష్ణ, విష్ణు,మోత్కుపల్లి బాలకృష్ణ పాల్గొన్నారు.

### ఢిల్లీలో కూలిన బహుళ అంతస్తుల భవనం..
## శిథిలాల కింద చిక్కుకున్న నివాసితులు

* ఢిల్లీలోని సీలంపూర్ ప్రాంతంలో ఉదయం 7 గంటల సమయంలో ఘటన
* నలుగురిని రక్షించిన అగ్నిమాపక సిబ్బంది
* కొనసాగుతున్న సహాయక చర్యలు





ఢిల్లీలోని సీలంపూర్ ప్రాంతంలో ఈ ఉదయం నాలుగంతస్తుల భవనం కుప్పకూలింది. శిథిలాల కింద చిక్కుకున్న పలువురిని రక్షించేందుకు సహాయక కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఇప్పటి వరకు ముగ్గురు, నలుగురిని రక్షించి ఆసుపత్రికి తరలించారు. శిథిలాల కింద ఇంకా పలువురు చిక్కుకుని ఉండొచ్చని అధికారులు చెబుతున్నారు. స్థానికులు కూడా సహాయక కార్యక్రమాల్లో పాలు పంచుకుంటున్నారు. సమాచారం అందుకున్న వెంటనే ఘటనాస్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. భవనం కుప్పకూలినట్టు ఉదయం ఏడు గంటలకు ఫోన్ కాల్ వచ్చినట్టు పోలీసులు తెలిపారు. ఉదయం తాను మంచంపై ఉండగా పెద్ద శబ్దం వినిపించిందని, బయటకు వచ్చిచూస్తే ఆ ప్రాంతమంతా దట్టంగా దుమ్ము పేరుకుపోయి ఉందని, అందరూ ఏడుస్తున్నారని ప్రత్యక్ష సాక్షి ఒకరు తెలిపారు. భవనం కూలినప్పుడు అందులో ఎంతమంది ఉన్నారన్న విషయం తెలియరాలేదు. కానీ, ఒక కుటుంబంలో పది మంది ఉంటారని, వారి పరిస్థితి ఏంటో తెలియదని ఆ సాక్షి పేర్కొన్నాడు.

# విమానం వాష్‌రూంలో దమ్ము కొట్టిన జంట... 17 గంటల పాటు ప్రయాణికులకు అగచాట్లు!

* **మెక్సికో నుంచి యూకే వెళుతున్న విమానం**
* **విమానం బాత్రూం నుంచి సిగరెట్ పొగ**
* **విమానాన్ని దారి మళ్లించిన పైలెట్లు**



మెక్సికోలోని కాంకన్ నుంచి లండన్‌లోని గాట్విక్ విమానాశ్రయానికి వెళుతున్న టీయూఐ ఎయిర్‌వేస్ విమానంలో జరిగిన ఒక అసాధారణ సంఘటనలో, ఒక జంట విమాన బాత్రూంలో ధూమపానం చేస్తూ పట్టుబడడంతో ప్రయాణికులు 17 గంటలకు పైగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ ఘటన జులై 8న సంభవించింది. ఇది విమానంలోని వందలాది మంది ప్రయాణికులకు తీవ్ర అసౌకర్యాన్ని కలిగించింది. విమాన భద్రతా నిబంధనల ఉల్లంఘనకు ఒక ఉదాహరణగా నిలిచింది. విమానం కాంకన్ నుంచి లండన్ గాట్విక్‌కు బయలుదేరిన కొద్ది సమయంలోనే, బాత్రూంలో పొగ తాగుతున్నట్టు విమాన సిబ్బంది గుర్తించారు. విమానంలో స్మోకింగ్ కఠినంగా నిషేధించబడిన విషయం అందరికీ తెలిసిందే. సిబ్బంది వెంటనే పరిశీలన చేపట్టగా, ఒక జంట సిగరెట్లు తాగుతూ ఉన్నట్లు తేలింది. ఈ జంట విమాన భద్రతా నిబంధనలను ఉల్లంఘించడమే కాక, ఇతర ప్రయాణికుల భద్రతకు కూడా ముప్పు కలిగించారు. కెప్టెన్ వెంటనే ఈ జంటను హెచ్చరించి, ధూమపానం కొనసాగితే విమానాన్ని మళ్లించాల్సి వస్తుందని ప్రకటించారు. అయినప్పటికీ, ఆ జంట హెచ్చరికలను పట్టించుకోకపోవడంతో, విమానాన్ని అత్యవసరంగా దారి మళ్లించాల్సి వచ్చింది. భద్రతా కారణాల రీత్యా, విమానం అమెరికాలోని మైనేలోని బాంగోర్ అంతర్జాతీయ విమానాశ్రయంలో రాత్రి 9:30 గంటల సమయంలో ల్యాండ్ అయింది. ఆ జంటను విమానం నుంచి దించివేసి, స్థానిక అధికారులకు అప్పగించారు. అయితే, ఆ విమాన సిబ్బంది విధులు చట్టపరమైన పని గంటలను మించిపోవడంతో, వారు ఆ విమానాన్ని తిరిగి తీసుకెళ్లే వీల్లేకపోయింది. దీంతో, యూకే నుంచి ఒక రిలీఫ్ సిబ్బందిని బాంగోర్‌కు పంపాల్సి వచ్చింది. ఇది మరింత ఆలస్యానికి కారణమైంది. ప్రయాణికులు బాంగోర్ విమానాశ్రయంలోని సైనిక ఎయిర్‌బేస్ విభాగంలో ఒక ఇరుకైన లాంజ్‌లో 17 గంటలకు పైగా గడపవలసి వచ్చింది. ఈ పరిస్థితిని బ్రిటిష్ ప్రయాణికుడు టెర్రీ లారెన్స్ (66) "యుద్ధజోన్"గా వర్ణించాడు. చూస్తుంటే ఇది మిలిటరీ ఎయిర్ పోర్ట్ లా ఉందని, ప్రయాణికులకు క్యాంప్ బెడ్‌లు, కొద్దిపాటి ఆహారం మాత్రమే అందించారని వెల్లడించాడు. ఇది తమకు తీవ్ర అసౌకర్యాన్ని కలిగించిందని వాపోయాడు. చివరకు, జులై 9న స్థానిక సమయం మధ్యాహ్నం 3 గంటలకు విమానం గాట్విక్‌కు బయలుదేరి సురక్షితంగా చేరుకుంది. ఈ ఘటనలో ఆ జంటపై చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. టీయూఐ ఎయిర్‌వేస్ ఈ ఘటనపై క్షమాపణలు చెప్పి, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చింది. ఈ ఘటన విమాన ప్రయాణ నిబంధనలను కఠినంగా పాటించాల్సిన అవసరాన్ని మరోసారి గుర్తు చేసింది.

## కిడ్నాప్ యత్నం నుంచి ధైర్యంగా తప్పించుకున్న బాలిక

* **మహారాష్ట్రలో ఘటన**
* **ఇంటికి వెళ్లేందుకు ఆటో ఎక్కిన బాలిక**
* **మరో రూట్లో తీసుకెళ్లిన ఆటో డ్రైవర్**
* **జామెట్రీ కంపాస్ తో ఆటో డ్రైవర్ పై దాడి చేసి తప్పించుకున్న బాలిక**

భయానక కిడ్నాప్ యత్నం నుంచి 16 ఏళ్ల బాలిక ధైర్యంగా తప్పించుకున్న ఘటన మహారాష్ట్రలోని థానేలో సంచలనం సృష్టించింది. తనను కిడ్నాప్ చేయాలని ప్రయత్నించిన ఆటోరిక్షా డ్రైవర్‌ను బాలిక జామెట్రీ కంపాస్ (గణిత పరికరం)తో ప్రతిఘటించి, కదులుతున్న వాహనం నుంచే దూకి ప్రాణాలను రక్షించుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఈ సంఘటన జూలై 9న భివండి ప్రాంతంలో చోటుచేసుకుంది. స్కూలుకు వెళ్లేందుకు ఆ బాలిక ఒక ఆటోరిక్షా ఎక్కింది. అయితే, డ్రైవర్ ఆమెను నిర్దేశించిన మార్గంలో కాకుండా వేరే మార్గంలో తీసుకెళ్లడం ప్రారంభించాడు. డ్రైవర్ ప్రవర్తనపై అనుమానం వచ్చిన బాలిక వెంటనే అతన్ని ప్రశ్నించింది. ఆటోరిక్షాను ఆపమని పదేపదే కోరినప్పటికీ, డ్రైవర్ బాలిక మాటలను పెడచెవిన పెట్టడమే కాకుండా, తన వేగాన్ని మరింత పెంచాడు. దీంతో బాలిక భయాందోళనకు గురైంది. ఆ పరిస్థితిలో, తన దగ్గర ఉన్న జామెట్రీ కంపాస్‌ను ఆత్మరక్షణ కోసం ఉపయోగించాలని బాలిక నిర్ణయించుకుంది. ఆమె ఎటువంటి సంకోచం లేకుండా ఆ డ్రైవర్‌ను ఆ కంపాస్‌తో ప్రతిఘటించింది. ఆ డ్రైవర్‌పై కంపాస్‌తో దాడి చేయడం ద్వారా అతన్ని ఒక క్షణం పాటు దిగ్భ్రాంతికి గురిచేసింది. ఇదే అవకాశంగా భావించిన ఆ బాలిక, తన ప్రాణాలను రక్షించుకోవడానికి చివరి ప్రయత్నంగా, కదులుతున్న ఆటోరిక్షా నుంచే బయటకు దూకేసింది. ఆమె రోడ్డుపై పడిపోయినప్పటికీ, స్వల్ప గాయాలతో క్షేమంగా బయటపడింది. బాలిక అపాయం నుంచి బయటపడిన అనంతరం తన తల్లికి సమాచారం అందించింది. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఘటనపై తీవ్రంగా స్పందించిన పోలీసులు, బాలిక ఇచ్చిన వివరాల ఆధారంగా కేసు నమోదు చేశారు. ఆటోరిక్షా డ్రైవర్‌పై కిడ్నాప్ యత్నం, దాడి ఆరోపణల కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. నిందితుడిని పట్టుకోవడానికి అన్ని కోణాల్లో గాలింపు చర్యలు చేపడుతున్నారు.

## అధ్యాపకుడి వేధింపులు... పెట్రోల్ పోసి నిప్పంటించుకున్న విద్యార్థిని

* **ఒడిశాలోని బాలాసోర్‌లో ఘటన**
* **అధ్యాపకుడు తనను వేధిస్తున్నాడని విద్యార్థి ఫిర్యాదు**
* **అధ్యాపకుడిపై చర్యలు తీసుకోవడంలో జాప్యం చేస్తున్నారంటూ నిరసన**
* **ప్రిన్సిపల్ కార్యాలయం వద్దకు పరుగెత్తుకెళ్లి నిప్పు అంటించుకున్న విద్యార్థిని**



ఒడిశాలోని బాలాసోర్‌లోని ఒక కళాశాలలో విషాదకర సంఘటన చోటు చేసుకుంది. లైంగిక వేధింపులకు గురిచేస్తున్నాడనే ఆరోపణలతో ఓ అధ్యాపకుడిపై ఫిర్యాదు చేసిన విద్యార్థిని, వేధింపులు భరించలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ ఘటనలో ఆమె 95 శాతం కాలిన గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఆమెను కాపాడబోయిన మరో విద్యార్థికి కూడా 70 శాతం కాలిన గాయాలయ్యాయి. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు ఆ అధ్యాపకుడిని అరెస్టు చేశారు. ఉన్నత విద్యాశాఖ కళాశాల ప్రిన్సిపల్‌ను సస్పెండ్ చేసింది. ఈ ఘటనకు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రి సూర్యబన్షి సూరజ్ హామీ ఇచ్చారు. ఫకీర్ మోహన్ కళాశాలలో చదువుతున్న బాధిత విద్యార్థిని జులై 1న కళాశాల అంతర్గత ఫిర్యాదుల కమిటీకి ఫిర్యాదు చేసింది. తన విభాగాధిపతి సమీర్ కుమార్ తనను వేధిస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొంది. వారం రోజుల్లో అతనిపై చర్యలు తీసుకుంటామని విద్యార్థినికి హామీ ఇచ్చినప్పటికీ, అది జరగలేదని తెలుస్తోంది. అధ్యాపకుడిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో మనస్తాపం చెందిన బాధిత విద్యార్థిని, ఇతర విద్యార్థులతో కలిసి కళాశాల గేటు వెలుపల నిరసనకు దిగింది. ఆ సమయంలో విద్యార్థిని ఒక్కసారిగా అక్కడి నుంచి పరుగెత్తుకుంటూ ప్రిన్సిపల్ కార్యాలయం వద్దకు వెళ్లి, తనపై తాను పెట్రోలు పోసుకొని నిప్పంటించుకుంది. మంటలు అంటుకున్న తర్వాత ఆమె కారిడార్‌లో పరుగెత్తుతున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. ఒక విద్యార్థి ఆమెను కాపాడేందుకు ప్రయత్నించగా, అతని టీషర్టుకు కూడా మంటలు అంటుకున్నాయి. ఈ ఘటనపై ప్రిన్సిపల్ దిలీప్ ఘోష్ స్పందిస్తూ, విద్యార్థిని ఫిర్యాదు చేసిందని, అంతర్గత కమిటీ నివేదికను సమర్పించే పనిలో ఉందని చెప్పారు. బాధిత విద్యార్థిని తనను కార్యాలయంలో కలిసిందని, ఆ అధ్యాపకుడి వల్ల తాను పడిన వేదనను తెలిపిందని, ఆ వెంటనే అతడిని తన కార్యాలయానికి పిలిచి విచారించానని ఆయన పేర్కొన్నారు.

## కోల్ కతా ఐఐఎం అత్యాచారం వ్యవహారంలో కొత్త ట్విస్ట్!

* **కోల్ కతా ఐఐఎం బాయ్స్ హాస్టల్ లో అమ్మాయిపై అత్యాచారం అంటూ కలకలం**
* **అయితే తమ కుమార్తెపై ఎలాంటి అత్యాచారం జరగలేదన్న తండ్రి**
* **ఆమె ఆటో నుంచి కిందపడిందని వెల్లడి**




కోల్ కతాలోని ప్రఖ్యాత ఐఐఎం బాయ్స్ హాస్టల్ లో ఓ విద్యార్థి తనపై అత్యాచారం చేశాడంటూ ఓ విద్యార్థిని సంచలన ఆరోపణలు చేయడం తెలిసిందే. తాను మానసిక సమస్యలతో బాధపడుతున్నానని, దాంతో ఆ విద్యార్థి కౌన్సెలింగ్ ఇస్తానని హాస్టల్ కు పిలిచి తనకు మత్తుమందు కలిపిన కూల్ డ్రింక్ ఇచ్చాని ఆ అమ్మాయి తెలిపింది. తాను స్పృహ కోల్పోగా, తనపై అత్యాచారం జరిగిందని పోలీసులకు ఫిర్యాదు చేసింది. అయితే ఈ వ్యవహారం ఆసక్తికర మలుపు తిరిగింది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) కలకత్తా విద్యార్థినిపై అత్యాచారం జరిగిందన్న వార్తలను ఆమె తండ్రి ఖండించారు. తన కుమార్తె ఆటోరిక్షాలో నుంచి పడిపోయిందని, అపస్మారక స్థితిలోకి వెళ్ళిందని ఆయన తెలిపారు. శుక్రవారం రాత్రి 9:34 గంటలకు తనకు ఫోన్ వచ్చిందని, తన కుమార్తెను పోలీసులు రక్షించి ఎస్ఎస్‌కేఎం ఆసుపత్రిలోని న్యూరాలజీ విభాగానికి తరలించారని ఆయన పేర్కొన్నారు. తన కుమార్తెపై ఎటువంటి లైంగిక దాడి జరగలేదని, ఆమెను హింసించలేదని లేదా దురుసుగా ప్రవర్తించలేదని తండ్రి పేర్కొన్నారు. పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదులో భాగంగా తన కుమార్తె ఏదో వ్రాయమని అడిగారని, దాంతో ఆమె ఆ పత్రంలో వివిధ అంశాలను రాసిందని ఆయన వెల్లడించారు. ఆమె చెప్పిన ప్రకారం ఓ వ్యక్తిని అరెస్ట్ చేశామని పోలీసులు చెప్పారని ఆయన పేర్కొన్నారు. అయితే, తాను తన కుమార్తెతో మాట్లాడానని, తనపై ఎలాంటి అత్యాచారం జరగలేదని ఆమె తనతో చెప్పిందని ఆయన వివరించారు. పోలీసులు చెప్పినట్టే ఫిర్యాదు పత్రంలో రాశానని పేర్కొందని కూడా ఆయన వెల్లడించారు.

## ఎంపీలకు జీతం సరిపోవడం లేదు కంగనా రనౌత్ ఆసక్తికర వ్యాఖ్యలు

* **రాజకీయాల్లో నిజాయితీగా పని చేసే ఎంపీలకు వేతనం సరిపోవడం లేదన్న కంగన**
* **సిబ్బందికి జీతాలు ఇచ్చిన తర్వాత ఎంపీలకు మిగిలేది అంతంత మాత్రమేనన్న కంగన**
* **ఆపరేషన్ సిందూర్ తర్వాత ట్రంప్ తీరు నచ్చడం లేదన్న కంగన రనౌత్**



రాజకీయ నాయకుల వేతనాలపై ఎంపీ కంగనా రనౌత్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ, రాజకీయాల్లో నిజాయితీగా పని చేసే ఎంపీలకు వేతనం సరిపోవడం లేదని అన్నారు. తమతో ఉండే సిబ్బందికి జీతాలు ఇచ్చిన తర్వాత ఎంపీలకు మిగిలేది అంతంత మాత్రమేనని అన్నారు. ప్రజాప్రతినిధులు, పీఏలతో కలిసి నియోజకవర్గాలకు వాహనాలలో వెళ్లేందుకు లక్షల రూపాయలు ఖర్చవుతున్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని ఒక ప్రదేశం నుండి మరొక ప్రదేశం కనీసం 300 నుండి 400 కిలోమీటర్ల దూరంలో ఉండటమే ఇందుకు కారణమని పేర్కొన్నారు. రాజకీయాలు చాలా ఖర్చుతో కూడుకున్నవని ఆమె అభిప్రాయపడ్డారు. ఎంపీలకు వచ్చే వేతనం ఏమాత్రం సరిపోవడం లేదని అన్నారు. అందుకే మరో ఉద్యోగం చేసుకోవాల్సిన పరిస్థితులు ఉన్నాయని అన్నారు. ఇప్పటికే చాలామంది ఎంపీలకు వ్యాపారాలు ఉన్నాయని, కొందరు న్యాయవాద వృత్తిలో ఉండగా, ఇంకొందరు ఇతర వృత్తుల్లో ఉన్నట్లు చెప్పారు. ఎంపీగా ఉంటే మరో ఉద్యోగం అవసరం కాబట్టి ఆ పదవిని వృత్తిగా తీసుకోలేమని పేర్కొన్నారు.

* **ట్రంప్‌కు ఇప్పుడు మద్దతుదారును కాదు...**

గతంలో తాను ట్రంప్‌నకు మద్దతుదారునని, కానీ ఆపరేషన్ సిందూర్ తర్వాత ఆయన తీరు నచ్చడం లేదని కంగనా రనౌత్ అన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు ఆగిపోవడానికి తానే కారణమని ట్రంప్ చెబుతున్నారని, అందుకే ఆయన తీరు నచ్చడం లేదని అన్నారు. అమెరికాలో కూడా ఆయన తప్పులు చేస్తున్నట్లు చెప్పారు.

## అహ్మదాబాద్ విమాన ప్రమాద నివేదికపై స్పందించిన రామ్మోహన్ నాయుడు

* **విమాన ప్రమాదంపై నివేదిక సమర్పించిన ఏఏఐబీ**
* **తుది నివేదిక వచ్చే వరకు వేచి చూడాలన్న రామ్మోహన్ నాయుడు**
* **అప్పుడే ఒక నిర్ణయానికి రావొద్దని సూచన**




అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై తక్షణమే ఒక నిర్ణయానికి రావొద్దని, తుది నివేదిక వచ్చే వరకు వేచి చూడాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. ఈ ప్రమాదంపై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) సమర్పించిన ప్రాథమిక నివేదికపై ఆయన స్పందించారు. ప్రపంచంలోనే అత్యంత ప్రతిభ కలిగిన పైలట్లు, సిబ్బంది మనకు ఉన్నారని, వారు విమానయాన రంగానికి వెన్నుముక వంటి వారని మంత్రి అన్నారు. వారే విమానయాన రంగానికి ప్రధాన వనరులని, వారి సంక్షేమం, శ్రేయస్సు కోసం తమ ప్రభుత్వం కృషి చేస్తుందని ఆయన తెలిపారు. ఎటువంటి నిర్ధారణకు రాకుండా తుది నివేదిక కోసం వేచి చూద్దామని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కేసులో అనేక సాంకేతిక అంశాలు ఇమిడి ఉన్నాయని ఆయన అన్నారు. అందుకే నివేదికపై ఇప్పుడే మాట్లాడటం తొందరపాటు అవుతుందని అభిప్రాయపడ్డారు. అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై ఏఏఐబీ 15 పేజీలతో కూడిన ప్రాథమిక నివేదికను ఇటీవల సమర్పించింది. విమానం టేకాఫ్ అయిన కొన్ని సెకన్లలోనే ఇంధన నియంత్రణ స్విచ్‌లు ఆగిపోయినట్లు ఆ నివేదికలో పేర్కొంది. ఒక పైలట్ మరో పైలట్‌ను ఆ స్విచ్ ఎందుకు ఆపివేశావని ప్రశ్నించగా, తాను స్విచ్ ఆఫ్ చేయలేదని మరొక పైలట్ చెప్పినట్లు నివేదిక వెల్లడించింది. కాక్‌పిట్‌లో పైలట్ల చివరి మాటలు ఇవేనని ఏఏఐబీ తెలిపింది. ఆ తర్వాత పైలట్లు మేడే కాల్ ఇచ్చారని పేర్కొంది.

## కుర్చీ దొరకడం అంత ఈజీ కాదు.. డీకే శివకుమార్ వ్యాఖ్య

* **కుర్చీ కోసం మేం ఆరాటపడుతుంటే మీరేమో కుర్చీ దొరికినా కూర్చోవట్లేదు**
* **బెంగళూరు అడ్వొకేట్ల సమావేశంలో డీకే వ్యాఖ్యలు**
* **సీఎం కుర్చీ వివాదం నేపథ్యంలో వైరల్ గా మారిన కామెంట్స్**



'మేం (రాజకీయ నాయకులు) కుర్చీ కోసం ఆరాటపడుతుంటే మీరు (అడ్వొకేట్లు) మాత్రం కుర్చీ ఖాళీగా ఉన్నా కూర్చోవడంలేదు' అంటూ కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారాయి. కర్ణాటక ముఖ్యమంత్రి పీఠం కోసం కొంతకాలంగా వివాదం రేగుతున్న విషయం తెలిసిందే. డీకే శివకుమార్ సీఎం పదవిని ఆశిస్తుండగా.. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తన సీటును వదులుకోవడానికి ఇష్టపడడంలేదు. ఈ విషయంపై ఇటీవల డీకే వర్గం ఎమ్మెల్యేలు చేసిన వ్యాఖ్యలతో కర్ణాటక కాంగ్రెస్ లో దుమారం రేగుతోంది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కుదిరిన ఒప్పందం ప్రకారం త్వరలోనే ముఖ్యమంత్రి మార్పు జరుగుతుందని డీకే వర్గం నేతలు అంటున్నారు. అయితే, ఐదేళ్లూ తానే ముఖ్యమంత్రిగా కొనసాగుతానని సిద్ధరామయ్య స్పష్టం చేశారు. ఈ వివాదం ఇలా కొనసాగుతుండగా తాజాగా శుక్రవారం బెంగళూరులో అడ్వొకేట్స్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన కెంపెగౌడ జయంతి వేడుకలకు డీకే శివకుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డీకే మాట్లాడుతూ.. సభలో చాలా కుర్చీలు ఖాళీగానే ఉన్నప్పటికీ లాయర్ మిత్రులు కూర్చోవడంలేదని అన్నారు. కుర్చీ విలువ బహుశా మీకు తెలిసి ఉండకపోవచ్చని, ఖాళీగా కనిపిస్తే వెంటనే కూర్చోవాలని వ్యాఖ్యానించారు.

# అనుమతులు లేకుండా యూనివర్సిటీ ప్రారంభించడం పెద్ద తప్పు: షర్మిల

* **వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ వర్సిటీ విద్యార్థుల సమస్యలపై షర్మిల ఆందోళన**
* **సీఓఏ అధికారులను కలిశానని షర్మిల వెల్లడి**
* **సమస్య పరిష్కారం కాకపోతే ఢిల్లీ వెళతామని స్పష్టీకరణ**

ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కడపలోని వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ యూనివర్సిటీ విద్యార్థుల సమస్యలపై ఆందోళన వ్యక్తం చేశారు. విజయవాడలో కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ (సీఓఏ) అధికారులతో భేటీ అయిన షర్మిల, విద్యార్థుల భవిష్యత్తు కోసం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై ఆమె ఎక్స్ లో స్పందించారు. “కడప వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ యూనివర్సిటీ విద్యార్థుల పక్షాన సీఓఏ అధికారులను విజయవాడలో కలవడం జరిగింది. గత ప్రభుత్వ హయంలో సీఓఏ అనుమతులు లేకుండా అడ్మిషన్లు



చేశారు. ఇప్పుడు విద్యార్థులకు సర్టిఫికెట్లు రావడం లేదు. వందలాది మంది విద్యార్థుల జీవితాలు అగమ్యగోచరంగా మారాయి. సీఓఏ అనుమతులు లేకుండా లైసెన్సులు రావడం లేదు. విద్యార్థులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. ఈ విద్యార్థుల కష్టాలు నేను ప్రత్యక్షంగా చూశా. ఆనాడు అనుమతులు లేకుండా యూనివర్సిటీ ప్రారంభించడం పెద్ద తప్పు. ఈ తప్పు సరిదిద్దాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉంది. రెండేళ్లుగా విద్యార్థులు పోరాటం చేస్తున్నా ఫలితం లేదు. వెంటనే సీఓఏ అనుమతులు తీసుకొని విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వాలని కోరాం. ఢిల్లీ స్థాయిలో సీఓఏను కలుస్తాం అని హెచ్చరించాం. ఒక నెల గడువు ఇచ్చాం. అధికారులు సానుకూలంగా స్పందించారు. ఈ తప్పును సరిద్దుతున్నాం అని హామీ ఇచ్చారు. నెల రోజుల్లో వైఎస్ఆర్ యూనివర్సిటీ విద్యార్థుల సమస్య పరిష్కారం కాకపోతే ఢిల్లీకి వెళతామని కాంగ్రెస్ పార్టీ తరపున హెచ్చరిస్తున్నాం” అని షర్మిల స్పష్టం చేశారు.

## “చీకట్లో” వ్యాఖ్యల ఫలితం... పేర్ని నానిపై కేసు నమోదు

* **చిక్కుల్లో పడిన వైసీపీ నేత పేర్ని నాని**
* **టీడీపీ నేత కనపర్తి శ్రీనివాసరావు ఫిర్యాదుతో అవనిగడ్డలో కేసు నమోదు**
* **వైసీపీ సమావేశాల్లో తీవ్ర వ్యాఖ్యలు చేసిన పేర్ని నాని**
* **రెచ్చగొట్టేలా ఉన్నాయంటున్న టీడీపీ నేతలు**



మాజీ మంత్రి, వైసీపీ నేత పేర్ని నాని చిక్కుల్లో పడ్డారు. ఆయనపై అవనిగడ్డ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పామర్రు, అవనిగడ్డ నియోజకవర్గాల్లో జరిగిన వైసీపీ సమావేశాల్లో ఆయన చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు ఈ కేసుకు కారణం. టీడీపీ నేత కనపర్తి శ్రీనివాసరావు ఈ వ్యాఖ్యలపై ఫిర్యాదు చేశారు. పేర్ని నాని వ్యాఖ్యలు శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ఉన్నాయని ఆరోపించారు. పేర్ని నాని తన ప్రసంగంలో, “రప్పా రప్పా అని కేకలు వేయడం కాదు... చీకట్లో కన్ను కొడితే పని అయిపోవాలి. ఏదైనా చేయాలంటే నిశ్శబ్దంగా చేయండి, అరవకండి” అని అన్నారు. ఈ వ్యాఖ్యలను రహస్యంగా రాజకీయ హింసకు ప్రోత్సాహించేలా ఉన్నాయని టీడీపీ నాయకులు ఆరోపించారు. ఈ ప్రసంగం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో అవనిగడ్డ నియోజకవర్గంలోని టీడీపీ, జనసేన నాయకులు తీవ్రంగా విమర్శించారు. ఈ వ్యాఖ్యలు రాజకీయ ఉద్రిక్తతలను పెంచి, హింసను రెచ్చగొట్టే అవకాశం ఉందని వారు హెచ్చరించారు. కనపర్తి శ్రీనివాసరావు తన ఫిర్యాదులో పేర్ని నానిని ‘రైస్ స్కామ్‌స్టర్’గా పేర్కొన్నారు, ఆయన వ్యాఖ్యలు సమాజంలో అరాచకాన్ని సృష్టించవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కేసులో చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

## “చీకట్లో నరికేయండి” అని పేర్ని నాని అనడం దేనికి సంకేతం?: కొనకళ్ల

* **ఓ కార్యక్రమంలో తీవ్ర వ్యాఖ్యలు చేసిన వైసీపీ నేత పేర్ని నాని**
* **చీకట్లో కన్నుకొడితే పనైపోవాలంటూ వ్యాఖ్యలు**
* **మండిపడుతున్న టీడీపీ నేతలు**

“చీకట్లో నరికేయండి” అని వైసీపీ నేత పేర్నినాని చేసిన వ్యాఖ్యలపై టీడీపీ నేతలు మండిపడుతున్నారు. తాజాగా, ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల సత్యనారాయణ కూడా పేర్ని నాని వ్యాఖ్యలను ఖండించారు. మంగళగిరిలోని టీడీపీ ప్రధాన కార్యలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లడారు. “గత ఎన్నికల ఫలితాల్లో జగన్ నిరంకుశ, అవినీతి పరిపాలనకు ప్రజలు గుణపాఠం చెప్పి.. ప్రతిపక్ష హోదా దక్కకుండా.. ఘోరంగా ఓడించారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కనీవినీ ఎరుగని రీతిలో కూటమి ప్రభుత్వం అత్యంత అధిక మెజార్టీతో అధికారాన్ని ఇచ్చారు. మీరు ఓడిపోయిన అవమానంతో, అసూయతో కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక దుష్ప్రచారం చేస్తూన్నారు. రప్పా.. రప్పా.. చీకట్లో కన్నుకొడితే పని అయిపోవాలి.. తలలు



లేచిపోవాలి.. అని పేర్ని నాని చేసిన వ్యాఖ్యలు దేనికి సంకేతం..? మాజీ మంత్రిగా, జిల్లా పార్టీ అధ్యక్షుడిగా ఉన్న పేర్ని నాని ప్రజాస్వామ్యన్ని రక్షించేవిధంగా మాట్లాడాలి. కానీ, హింసను ప్రేరేపించే విధంగా మాట్లాడటం దారుణం. ఆంధ్రప్రదేశ్ లో అంబేద్కర్ రాజ్యాంగం నడుస్తుంది.. సీఎం చంద్రబాబు సారథ్యంలో ఉన్న కూటమి ప్రభుత్వంలో హింసను ఎట్టిపరిస్థితుల్లో ప్రొత్సహించరు. గత ప్రభుత్వంలో జగన్ రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలు చేసి.. అవినీతి మయంగా, ఆరాచకంగా మార్చారు. గతంలో టీడీపీ నాయకులను, కార్యకర్తలపై దాడులు చేసి, హత్యలు చేశారు. అది మీ సంస్కృతి.. ప్రజలు మీకు తగిన గుణపాఠం చెప్పారు. పేర్నినాని మీద బందరులో ఎన్నో అభియోగాలు ఉన్నాయి! నువ్వు ఎన్ని నేరాలు చేశావ్.. గోడౌన్ లో రేషన్ బియ్యం ఎక్కడికి పోయాయి? రంగనాయకుల గుడి 10 ఎకరాల స్థలానికి ఏమి సమాధానం చెబుతావు... బీచ్ పక్కన ఉన్న గుడిసెలను తగలబెట్టారు... దానికి ఏమి సమాధానం చెబుతావు... దమ్మొంటే అక్కడికి వెళ్లి మాట్లాడాలి. పేర్ని నాని ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో తమ్మిన వారి సత్రానికి చెందిన 1000 గజాల స్థలాన్ని అక్రమించుకున్నారు. పేర్ని నాని తండ్రి పేర్ని విష్ణుమూర్తి ఎనాడూ కూడా హింసను ప్రోత్సహించే విధంగా మాట్లాడలేదు. కానీ, నీ ప్రవర్తన ధోరణి మీ నాయకుడు మెచ్చుకునే విధంగా ఉంది. హింసను ప్రోత్సాహించి.. పరుష పదజాలంతో వేరే పార్టీ వారిని తిడితే మీ నాయకుడికి ఆనందం.. జగన్ ఓదార్పు యాత్ర పేరుతో పాదయాత్ర చేస్తే అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు... ఎక్కడ ఏ విధమైన అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూస్తే.. జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత మాత్రం యువనేత నారా లోకేశ్ యువగళం పేరుతో పాదయాత్ర చేస్తే అడుగడుగునా ఆటంకాలు సృష్టించారు. బెదిరింపులు మాటలతో ప్రజలను భయభ్రాంతులను గురి చేయడం వల్ల వచ్చే లాభం ఏమి ఉండదు” అని అన్నారు.

## పేర్ని నాని వ్యాఖ్యల ద్వారా అది మరోసారి స్పష్టమయింది: బోడె ప్రసాద్

* **రప్పా రప్పా ప్లకార్డును జగన్ సమర్థించారన్న బోడె ప్రసాద్**
* **తలలు నరికేయండని పేర్ని నాని చెబుతున్నారని మండిపాటు**
* **అవినీతి సొమ్ముతో పేర్ని నాని విర్రవీగుతున్నారని వ్యాఖ్య**



పల్నాడు జిల్లా పర్యటనలో వైసీపీ కార్యకర్త రప్పా రప్పా అనే ప్లకార్డు పట్టుకుంటే... మీడియా సమక్షంలో దాన్ని జగన్ సమర్థించారంటే ఆయన మానసిక పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతోందని టీడీపీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. మాజీ సీఎంగా, ఒక పార్టీ అధినేతగా ప్రజాప్రతినిధులకు జగన్ ఇచ్చే స్ఫూర్తి ఇదేనా? అని ప్రశ్నించారు. చీకట్లో కన్నుకొడితే పనైపోవాలని, తలలు నరికేయండని పేర్ని నాని చెబుతున్నారని మండిపడ్డారు. అభివృద్ధి, సంక్షేమం ద్వారా ప్రజల మన్ననలు పొందాలని చంద్రబాబు పదేపదే చెబుతుంటారని... వైసీపీ నేతలు మాత్రం తలలు నరకండి, హత్యలు చేయండి అని చెబుతున్నారని విమర్శించారు. వైసీపీ పాలనలో విధ్వంసం, హింస ఎలా ఉందో పేర్ని నాని వ్యాఖ్యల ద్వారా మరోసారి స్పష్టమయిందని చెప్పారు. అవినీతి సొమ్ముతో నాని విర్రవీగి వ్యవహరిస్తున్నారని... గత ఎన్నికల ఫలితాలను గుర్తుంచుకోవాలని అన్నారు.

## 20 మందిని కస్టడీలోకి తీసుకున్నారు.. వాళ్ల అరెస్ట్ చూపించలేదు... కోర్టులో ప్రవేశపెట్టలేదు: జగన్

* **రాష్ట్రంలో చంద్రబాబు నిరంకుశ పాలన సాగుతోందన్న జగన్**
* **చట్ట ప్రకారం నిరసనలు తెలిపినా అక్రమ కేసులు ఎదుర్కోవాల్సి వస్తోందని వ్యాఖ్య**
* **సినిమా పోస్టర్ ప్రదర్శించిన యువకుడిని జైల్లో పెట్టారని మండిపాటు**

కూటమి ప్రభుత్వంపై వైసీపీ అధినేత జగన్ మరోసారి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఎక్స్ వేదికగా ఆయన స్పందిస్తూ... ప్రభుత్వాన్ని ప్రశ్నించే గొంతుకలను పోలీసు వ్యవస్థను అడ్డు పెట్టుకుని నులిమేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రజాస్వామికమైన ప్రాథమిక హక్కులకు భంగం కలుగుతోందని అన్నారు. చంద్రబాబు నిరంకుశ పాలనలో ప్రజల హక్కులు అణచివేయబడుతున్నాయని



దుయ్యబట్టారు. చట్టానికి లోబడి నిరసనలు తెలిపినా అక్రమ కేసులు ఎదుర్కోవాల్సి వస్తోందని జగన్ మండిపడ్డారు. “గుంటూరు మిర్చియార్డులో రైతుల పరామర్శకు వెళ్లినప్పుడు ఒక కేసు పెట్టారు. రామగిరిలో లింగమయ్య కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్లినప్పుడు తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డిపై కేసు పెట్టారు. పొదిలిలో పొగాకు రైతులను పరామర్శించేందుకు వెళితే మూడు కేసులు పెట్టి 15 మందిని అరెస్ట్ చేశారు. పల్నాడులో పోలీసు వేధింపులకు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్న నాగమల్లేశ్వరరావు కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళితే ఐదు కేసులు నమోదు చేశారు. 131 మందికి నోటీసులు జారీ చేశారు. సినిమా పోస్టర్ ప్రదర్శించిన యువకుడిని జైల్లో పెట్టారు” అని ఆగ్రహం వ్యక్తం చేశారు. బంగారుపాళ్యంలో మామిడి రైతులను పరామర్శించడానికి వెళితే ఐదు కేసులు పెట్టి 20 మందిని కస్టడీలోకి తీసుకున్నారని జగన్ మండిపడ్డారు. వారిని అరెస్ట్ చేసినట్టు చూపించలేదని, కోర్టులో హాజరుపరచలేదని అన్నారు. తన ప్రతి పర్యటనలో అక్రమ కేసులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చెక్ పోస్టులు ఏర్పాటు చేసి రైతులను రానీయకుండా చేస్తున్నారని మండిపడ్డారు. ఇందుకోసం పోలీసు వ్యవస్థను వాడుకోవడం సరికాదని అన్నారు.

## జగన్ మనసులోని మాటలనే పేర్ని నాని, ప్రసన్న మాట్లాడుతున్నారు : దేవినేని ఉమ

* **జగన్ ను ప్రజలు లేవకుండా చేశారన్న దేవినేని ఉమ**
* **సింగయ్య భార్యను బెదిరించి తప్పడు ప్రకటన ఇప్పించారని మండిపాటు**
* **విజయసాయి భగవద్గీత శ్లోకాలు వల్లిస్తున్నారని ఎద్దేవా**



151 సీట్లు గెలిచామనే మదంతో జగన్ ఇష్టానుసారం వ్యవహరించారని... దీంతో 11 సీట్లతో ప్రజలు ఆయనను లేవకుండా చేశారని టీడీపీ నేత దేవినేని ఉమ ఎద్దేవా చేశారు. చీకట్లో కన్నుకొట్టే తప్పుడు పనులు చేయడం వల్లే ప్రజలు బుద్ధి చెప్పారని అన్నారు. తాజాగా పేర్ని నాని కూడా అలాంటి వ్యాఖ్యలే చేస్తున్నారని... ఏదైనా చేయాలంటే చీకట్లో కన్నుకొడితే అయిపోవాలని కార్యకర్తలను రెచ్చగొడుతున్నారని మండిపడ్డారు. సొంత పార్టీ కార్యకర్త సింగయ్యను కారుతో తొక్కించిన జగన్... ఆ తప్పును కప్పిపుచ్చేందుకు సింగయ్య భార్యను బెదిరించి తప్పుడు ప్రకటన ఇప్పించారని దేవినేని అన్నారు. సోదరి వరుస అయ్యే మహిళా ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి పట్ల ప్రసన్న కుమార్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను జగన్ ఖండించకుండా సమర్థించారని మండిపడ్డారు. జగన్ మనసులోని మాటలనే పేర్ని నాని, ప్రసన్నకుమార్ రెడ్డి మాట్లాడుతున్నారని అన్నారు. కర్మఫలం అంటూ విజయసాయిరెడ్డి భగవద్గీత శ్లోకాలు వల్లిస్తున్నారని.... నీ దగ్గర పని చేసిన అధికారులేసిట్ విచారణలో నీ గుట్టు విప్పుతున్నారని దేవినేని ఉమా అన్నారు.

## శ్రీవారి భక్తులకు మెరుగైన సేవలను అందించేందుకు ప్రత్యేక కార్యాచరణ

* **ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నామన్న ఆనం**
* **160 ఆలయాల్లో భక్తుల దర్శనాన్ని సులభతరం చేశామని వెల్లడి**
* **నాణ్యమైన ప్రసాదాలను అందిస్తున్నామన్న మంత్రి**

తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వారి భక్తులకు మెరుగైన సేవలను అందించేందుకు తమ ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపడుతోందని దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. టీటీడీలోని పలు విభాగాల్లో పని చేస్తున్న ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఈరోజు సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనల మేరకు ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతామని ఆనం చెప్పారు. సీఎం ఆమోదం పొందిన తర్వాత ఆ నిర్ణయాలను అమలు చేస్తామని తెలిపారు. రాష్ట్రంలోని 160 ఆలయాల్లో భక్తులకు దర్శనాన్ని సులభతరం చేశామని, నాణ్యమైన ప్రసాదాలను అందిస్తున్నామని చెప్పారు. 300 ఆలయాలకు ధూప, దీప, నైవేద్యాలకు నిధులు మంజూరు చేశామని



తెలిపారు. 200కు పైగా ఆలయాల పునర్నిర్మాణం కోసం కామన్ వెల్ఫేర్ ఫండ్ నుంచి నిధులు మంజూరు చేశామని వెల్లడించారు.

## వరల్డ్ పోలీస్ గేమ్స్ లో టీటీడీ అధికారుల ప్రతిభ... అభినందించిన బీఆర్ నాయుడు

* **అమెరికాలోని బర్మింగ్ హామ్ లో వరల్డ్ పోలీస్ గేమ్స్-2025**
* **టెన్నిస్ లో గోల్డ్, బ్రాంజ్ మెడల్స్ గెలిచిన టీటీడీ విజిలెన్స్ అధికారులు సురేంద్ర, రామ్ కుమార్**
* **ఘనంగా సన్మానించిన టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు**

తిరుమల తిరుపతి దేవస్థానాల (టీటీడీ) విజిలెన్స్ అధికారులు ఎ. సురేంద్ర, ఎన్.టి.వీ. రామ్ కుమార్ లు అమెరికాలోని బర్మింగ్‌హామ్‌లో జరిగిన ప్రపంచ పోలీస్ క్రీడల 2025లో అద్భుతమైన ప్రతిభ కనబరిచారు. వారిద్దరినీ నేడు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు ఘనంగా సన్మానించారు. ఈ అధికారులు టెన్నిస్‌లో బంగారు, కాంస్య పతకాలను సాధించి దేశానికి గర్వకారణంగా నిలిచారని బీఆర్ నాయుడు అభినందించారు. ఎ. సురేంద్ర 45 ప్లస్ డబుల్స్ విభాగంలో బంగారు పతకం, ఎన్.టి.వీ. రామ్ కుమార్ 55 ప్లస్ డబుల్స్‌లో కాంస్య పతకం సాధించారు. ప్రపంచ పోలీస్ క్రీడల్లో 80 దేశాల నుంచి 9,000 మంది అథ్లెట్లు పాల్గొన్నారు. ఈ పోటీల్లో టీటీడీ అధికారులు కూడా పాల్గొని విశేషంగా రాణించారు. ఈ విజయం టీటీడీ ప్రతిష్ఠను మరింత పెంచుతుందని బీఆర్ నాయుడు అన్నారు.



## పలు దేశాలపై అమెరికా విధించిన సుంకాలు

# ఆగస్టు 1 నుంచి అమల్లోకి..!



**న్యూయార్క్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల పలు దేశాలపై సుంకాల మోత మోగించారు. మెక్సికో తోపాటు యూరోపియన్ యూనియన్ నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై 30 శాతం సుంకాలు విధించారు.

ఈ పెంచిన సుంకాలు ఆగస్టు 1 నుంచి అమల్లోకి వస్తాయని ట్రంప్ ప్రకటించారు. ఇదే విషయాన్ని తెలియజేస్తూ ట్రంప్.. ఈయూ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాండెర్ లెయెన్‌కు, మెక్సికో అధ్యక్షురాలు క్లాడియా షీన్‌బామ్‌లకు లేఖలు రాశారు.

## ఇండియన్ మార్కెట్‌లోకి ఎంట్రీ..

### కీలక ప్రకటన చేసిన టెస్లా




**న్యూఢిల్లీ:** ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన లగ్జరీ ఎలక్ట్రిక్ కార్ల తయారీ దిగ్గజం టెస్లా భారత్‌లో అడుగుపెట్టేందుకు సిద్ధమవుతోంది. దేశ ఆర్థిక రాజధాని ముంబైలో తొలి షోరూం ప్రారంభించనున్నట్లు తెలిసింది. జులై 15న టెస్లా భారత్‌లో తొలి షోరూంను అఫీషియల్‌గా లాంచ్ చేయనున్నట్లు వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇండియన్ మార్కెట్‌లోకి ఎంట్రీపై టెస్లా తాజాగా కీలక ప్రకటన చేసింది. ఈ మేరకు 'టెస్లా ఇండియా' పేరుతో ఎక్స్ ఖాతాను తెరిచింది. అందులో తొలి పోస్ట్‌గా 'కమింగ్ సూన్' అంటూ ఓ ఫొటోను డ్రాప్ చేసింది. ఈ ఏడాది జులైలో భారత విపణిలోకి అడుగుపెట్టనున్నట్లు అఫీషియల్‌గా ప్రకటించింది.

ప్రముఖ వార్తా సంస్థ రాయిటర్స్ ప్రకారం.. ముంబై జియో వరల్డ్‌లో టెస్లా తన మొదటి ఈ షోరూం ప్రారంభించనున్నట్లు తెలిసింది. ఇందుకోసం ఇప్పటికే టెస్లా సంస్థ వై మోడల్ కార్లను చైనాలోని షాంఘై నగరంలో గల తమ ఫ్యాక్టరీ నుంచి తీసుకొచ్చినట్లు సమాచారం. డిమాండ్‌ను బట్టి ఆ తర్వాత ఢిల్లీలోనూ షో రూం ఏర్పాటు చేయాలనే ప్రణాళికతో టెస్లా ఉందని సదరు నివేదికలు వెల్లడించాయి.

ఈ షోరూం కోసం ముంబై నడిబొడ్డున బాంద్రా కుర్లా కాంప్లెక్స్ (బీకేసీ) బిజినెస్ డిస్ట్రిక్ట్‌లో 4,000 చదరపు అడుగుల స్థలాన్ని టెస్లా సంస్థ అద్దెకు తీసుకున్నట్లు ఇటీవలే వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. పార్కింగ్ సౌకర్యాలుగల ఈ షోరూమ్ స్పేస్‌కుగాను కంపెనీ ప్రమోటర్, బిలియనీర్ ఎలాన్ మస్క్ నెలకు రూ.35 లక్షల అద్దె చెల్లించనున్నారని తెలిసింది. అద్దె ఏడాదికి 5 శాతం పెంపు ప్రాతిపదికన ఐదేళ్ల కాలానికి యూనివ్‌కో ప్రాపర్టీస్ నుంచి లీజుకి తీసుకుంది. ఈ ప్రాపర్టీ గ్రౌండ్ ఫ్లోర్ దేశీయంగా ఏర్పాటైన తొలి యాపిల్ స్టోర్‌కు దగ్గరగా ఉంటుంది. రెంటల్ అగ్రిమెంట్ ఫిబ్రవరి 27న రిజిస్టరైంది. రూ.2.11 కోట్లు సెక్యూరిటీ డిపాజిట్‌గా కూడా టెస్లా జమ చేసినట్లు సమాచారం.

ఎలన్ మస్క్ సారథ్యంలోని టెస్లా భారత మార్కెట్‌లోకి అడుగుపెట్టేందుకు ఎంతోకాలంగా ప్రయత్నాలు చేస్తున్న విషయం తెలిసిందే. భారత్ విధించే దిగుమతి సుంకాలు తమకు అడ్డంకిగా మారాయని టెస్లా గతంలోనే పేర్కొంది. అయితే, భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఇటీవలే అమెరికాలో పర్యటించిన విషయం తెలిసిందే. రెండు రోజుల పర్యటనలో భాగంగా టెస్లా బాస్ ఎలాన్ మస్క్‌తో భేటీ అయ్యారు. ఆ భేటీలో వాణిజ్య అంశాలపై చర్చించినట్లు తెలిసింది. ఇందులో భాగంగా టెస్లా భారత్‌లో ప్రవేశానికి సంబంధించిన కీలక అంశాలను కూడా ఇరువురూ ప్రస్తావించినట్లు సమాచారం.

మెదీ అమెరికా పర్యటన సమయంలోనే భారత్‌లో టెస్లా విస్తరణకు బీజం పడింది. ఆటోమొబైల్ రంగంలో కొత్త ఒరవడి సృష్టించిన టెస్లా కంపెనీ ఎలక్ట్రిక్ కార్ల మార్కెట్‌కు ఈసారి భారత్‌ను ఎంచుకుంది. యూరప్, చైనాలో అమ్మకాలు పడిపోవడంతో ఇండియాలో సొమ్ము చేసుకోవాలనే ఆలోచనతో ఉంది ఎలాన్ మస్క్ సంస్థ. అందులో భాగంగానే ముంబైలో తమ తొలి షోరూంను ప్రారంభించేందుకు సిద్ధమైంది. ప్రస్తుతం ఎలక్ట్రిక్ కార్లలో అత్యధిక అమ్మకాలతో రికార్డు నెలకొల్పిన వై మోడల్ కారు ధర పన్నులు, బీమా కలిపితే రూ. 48 లక్షలపైనే ఉండనుంది.

## భారతీయుల కోసం

## భారీ ఆఫర్ ప్రకటించిన ఎలాన్ మస్క్..!



**న్యూయార్క్:** భారతీయుల కోసం ఎలాన్ మస్క్‌కు చెందిన ఎక్స్ భారీ ఆఫర్‌ను ప్రకటించింది. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ భారతదేశంలోని తన వినియోగదారులకు సబ్‌స్క్రిప్షన్ ఫీజులను గణనీయంగా తగ్గించిందని నివేదికలు సూచిస్తున్నాయి. సోసిలా మీడియా ప్లాట్‌ఫామ్ 48 శాతం వరకు డిస్కౌంట్లను అందిస్తోంది. దాని పోర్టల్‌లోని అప్డేట్ ప్రకారం.. మొబైల్ యాప్ వినియోగదారులకు ప్రీమియం ఖాతా సబ్‌స్క్రిప్షన్ ఫీజును దాదాపు 48 శాతం తగ్గించారు. ఈ డిస్కౌంట్ నెలవారీగా ఖర్చును రూ.900 నుండి రూ.470కి తగ్గించింది. అదనంగా వెబ్ ఖాతాలకు ప్రీమియం సబ్‌స్క్రిప్షన్ ఫీజు దాదాపు 34 శాతం తగ్గింది, రూ.650 నుండి రూ.427కి మారింది. ప్రీమియం, ప్రీమియం-ప్లస్ సేవల సబ్‌స్క్రైబర్లు వారి పేరు లేదా పక్కన చెక్‌మార్క్‌ను అందుకుంటారు.

యాప్ స్టోర్‌లు విధించే అదనపు రుసుముల కారణంగా మొబైల్ యాప్ సబ్‌స్క్రిప్షన్ ధర రూ.470 ఎక్కువగా ఉందని గమనించబడింది. ప్రాథమిక సబ్‌స్క్రైబర్‌ల కోసం నెలవారీ సబ్‌స్క్రిప్షన్ రుసుములో 30 శాతం తగ్గింపు కూడా ఉంది, ఇది రూ.243.75 నుండి రూ.170కి తగ్గించబడింది. ప్రాథమిక ఖాతాదారులు పోస్ట్‌లను సవరించడానికి, పొడవైన పోస్ట్‌లను వ్రాయడానికి, నేపథ్య వీడియో ప్లేబ్యాక్‌ను ప్రారంభించడానికి, వీడియోలను డౌన్‌లోడ్ చేయడానికి అనుమతించే లక్షణాలను ఆనందిస్తారు.

ప్రాథమిక ఖాతాలకు వార్షిక చందా రుసుము దాదాపు 34 శాతం తగ్గింది. గతంలో రూ.2,590.48గా ఉన్న దీని ధర ఇప్పుడు రూ.1,700గా ఉంది. ఎక్స్ ఖాతాలకు ప్రీమియం ప్లస్ సబ్‌స్క్రిప్షన్ ఇప్పుడు వెబ్ వినియోగదారులకు 26 శాతం తక్కువ రేటుతో రూ.2,570కి అందుబాటులో ఉంది. గతంలో ఇది రూ.3,470గా ఉండేది. ప్రీమియం ప్లస్ ఖాతాలు ఉన్న వినియోగదారులు ప్రకటన రహిత అనుభవాన్ని, కథనాలను వ్రాయగల సామర్థ్యాన్ని ఆస్వాదించవచ్చు. చివరగా, ప్రీమియం ప్లస్ సబ్‌స్క్రిప్షన్ మొబైల్ వెర్షన్ ధర ఇప్పుడు రూ. 3,000గా ఉంది. ఇంతకుముందు దాదాపు రూ. 5,100గా ఉండేది.




# మెరిసిన సురేఖ, ప్రీతికా..

## ఒకేరోజు భారత్‌కు రజతం, కాంస్యం




**స్పెయిన్:** స్పెయిన్ వేదికగా జరుగుతున్న ఆర్చరీ వరల్డ్ కప్ స్టేజ్ 4లో భారత మహిళా బృందం పతకాల వేట కొనసాగిస్తోంది. జ్యోతి సురేఖ, పర్నీత్ కౌర్, ప్రీతికా ప్రదీప్‌లతో కూడిన త్రయం శనివారం జరిగిన కాంపౌండ్ టీమ్ ఈవెంట్లో రజతం కొల్లగొట్టింది. పోడియం మీద మువ్వన్నెల జెండాను ఈ ముగ్గురు రెపరెపలాడించగా.. మిక్స్‌డ్ టీమ్ విభాగంలో సురేఖ గురి అదరడంతో కాంస్యం కూడా వచ్చి చేరింది.

క్వాలిఫికేషన్ రౌండ్‌లో 16 ఏళ్ల ప్రీతికా 2,116 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. దాంతో, భారత బృందం ఫైనల్‌కు దూసుకెళ్లింది. అయితే.. పసిడి పోరులో ఒత్తిడికి లోనైన త్రయం రెండో స్థానంతో సిల్వర్ మెడల్‌కే పరిమితమైంది. చైనీస్ తైపీ బృందం స్వర్ణం ఎగరేసుకుపోయింది.

అనంతరం జరిగిన మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్లో సురేఖ, రిషభ్ యాదవ్ ద్దయం 1,431 పాయింట్లతో వరల్డ్ రికార్డు నెలకొల్పారు. పదో సీడ్ జంటను చిత్తు చేసి దేశానికి కాంస్యం అందించారు. అయితే.. మహిళల కాంపౌండ్ టీమ్ సెమీఫైనల్లో మాత్రం భారత ఆర్చర్లు తీవ్రంగా నిరాశపరిచారు. నెదర్లాండ్స్‌కు చెందిన12వ సీడ్‌ల ముందు నిలువలేక నిష్క్రమించారు.

# క్రికెట్‌లో సంచలనం..

### వరల్డ్ కప్ బెర్తుతో చరిత్ర సృష్టించిన ఇటలీ




**న్యూఢిల్లీ:** యూరప్‌లో ఒకటైన ఇటలీ పేరు చెబితే ఫుట్‌బాల్, టెన్నిస్ వంటి ఆటల్లోని రికార్డులే గుర్తుకు వచ్చేవి. కానీ, ఇప్పుడు క్రికెట్‌లో కూడా ఇటలీ సంచలనాలు సృష్టిస్తోంది. అంతర్జాతీయ క్రికెట్లో ఇప్పుడిప్పుడే అడుగులు వేస్తున్న ఆ జట్టు ఏకంగా పురుషుల టీ20వరల్డ్ కప్ పోటీలకు అర్హత సాధించింది. వచ్చే ఏడాది భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న పొట్టి ప్రపంచకప్‌లో ఈ పసికూన ఆడనుంది. ఐసీసీ మెగా టోర్నీ బరిలో నిలవడవం ఇదే మొదటిసారి. టీ 20 వరల్డ్ కప్ యూరప్ క్వాలిఫయర్స్‌లో ఇరగదీసిన ఇటలీ.. విశ్వ వేదికపై తమ ఆగమనాన్ని ఘనంగా చాటాలని ఆరాటపడుతోంది.

టీ 20 వరల్డ్ కప్ యూరప్ క్వాలిఫయర్స్‌లో జో బర్న్స్ కెప్టెన్సీలోని ఇటలీ అద్భుత విజయాలతో అదరగొట్టింది. నెదర్లాండ్స్, స్కాట్లాండ్ వంటి బలమైన జట్లను వెనక్కి నెట్టి చరిత్రలో తొలిసారి పొట్టి ప్రపంచకప్‌లో ఆడే అవకాశాన్ని దక్కించుకుంది. స్విట్జర్‌లాండ్‌లోని ది హేగ్‌లో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో నెదర్లాండ్స్ చేతిలో ఇటలీ ఓడిపోయింది.

కానీ, నెట్ రన్‌రేటు మెరుగ్గా ఉండడంతో అందర్నీ ఆశ్చర్యపరుస్తూ వరల్డ్ కప్ బెర్తు కైవసం చేసుకుంది. దాంతో, ఆ జట్టు ఆటగాళ్ల సంబురాలకు హద్దే లేకుండా పోయింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఇటలీ నిర్ణీత ఓవర్లలో 134 రన్స్ చేసింది. అనంతరం డచ్ టీమ్ లక్ష్యాన్ని ఛేదించినప్పటికీ అనుకున్న రన్‌రేటు సాధించలేదు. అయినా సరే వరల్డ్ కప్ బరిలో నిలిచింది.

భారత్, లంక వేదికగా జరుగబోయే వరల్డ్ కప్ పోటీలకు ఇప్పటివరకూ 15 జట్లు అర్హత సాధించాయి. ఆతిథ్య భారత్, లంకతో పాటు ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, పాకిస్థాన్, అఫ్గనిస్థాన్, దక్షిణాఫ్రికా, కెనడా, బంగ్లాదేశ్, ఐర్లాండ్, నెదర్లాండ్స్ వెస్టిండీస్ న్యూజిలాండ్, యూఎస్ఏ, ఇటలీ జట్లు క్వాలిఫై అయ్యాయి. త్వరలో జరుగనున్న ఆసియా క్వాలిఫయర్, ఆఫ్రికా క్వాలిఫయర్ ఫలితాలతో మరో ఐదు బెర్తులు ఖాయం అవుతాయి.

## పోలాండ్ డైమండ్ లీగ్‌లో

# నీరజ్ వర్సెస్ నదీమ్

### ఈసారి పైచేయి ఎవరిదో..!

**పోలాండ్:** భారత్, పాకిస్థాన్ జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్‌కు ఉండే క్రేజ్ తెలిసింది. ఈమధ్య ఇరుదేశాల అథ్లెట్ల మధ్య జావెలిన్ త్రో పోటీ కూడా అంతే ఉత్కంఠ రేపుతోంది. అంతర్జాతీయ వేదికలపై నీరజ్ చోప్రా, అర్షద్ నదీమ్ తగ్గేదేలే అన్నట్టు పోటీ పడుతుండడమే అందుకు కారణం. ఒకప్పుడు స్నేహితుల్లా మెలిగిన వీళ్లు ఈసారి ప్రత్యర్థులుగానే బరిలోకి దిగబోతున్నారు. పారిస్ ఒలింపిక్స్ తర్వాత తొలిసారి నువ్వానేనా అన్నట్టు ఈటెను విసిరేందుకు సిద్ధమవుతున్నారు ఇద్దరు. పోలాండ్‌లోని సెలేసియాలో ఆగస్ట్ 16న జరుగబోయే డైమండ్ లీగ్‌లో దాయాది అథ్లెట్లు తమ తడాఖా చూపించనున్నారు.

జావెలిన్ త్రోలో దిగ్గజ ఆటగాడిగా ఎదిగిన నీరజ్ టోక్యో ఒలింపిక్స్‌లో స్వర్ణంతో చరిత్ర సృష్టించాడు. పారిస్ విశ్వ క్రీడల్లోనూ అతడు గోల్డ్ మెడల్ సాధిస్తాడనుకున్నారంతా. కానీ, నదీమ్ 92.97 మీటర్ల దూరంతో నీరజ్(89.45 మీటర్లు)కు షాకిచ్చాడు. అయితే.. నిరుదు ఆగస్టు 8న చివరిసారి పోటీపడిన ఈ ఇద్దరూ త్వరలోనే పోలాండ్ డైమండ్ లీగ్‌లో ఎదురుపడనున్నారు.





హల్గాం ఉగ్రదాడి, 'ఆపరేషన్ సిందూర్' తదనంతర పరిణామాలతో ఇరుదేశాల మధ్య వైరం మరింత పెరిగిన నేపథ్యంలో నీరజ్, నదీమ్‌ల జావెలిన్ ఫైట్ అందరిలో ఆసక్తి రేపుతోంది. ఈమధ్యే దోహా డైమండ్ లీగ్‌లో 90 మీటర్ల మార్క్ అందుకున్న భారత బడిసె వీరుడు ఈసారి పాకిస్థాన్ అథ్లెట్‌కు ఝలక్ ఇవ్వాలనుకుంటున్నాడు. ఈ టోర్నీ తర్వాత సెప్టెంబర్‌లో వరల్డ్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్‌లో నీరజ్ పోటీపడనున్నాడు.

# మరోసారి చేతులెత్తేసిన టెయిలెండర్లు..

### టీమిండియా ఆలౌట్




**లార్డ్స్:** లార్డ్స్ టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో భారత జట్టు పట్టుబిగించే అవకాశాన్ని కోల్పోయింది. మూడో రోజు ఓపెనర్ కేఎల్ రాహుల్ సెంచరీ(100)కి వైస్ కెప్టెన్ రిషభ్ పంత్(74), రవీంద్ర జడేజా (72)ల అర్ధ శతకాలతో చెలరేగిన వేళ మంచి ఆధిక్యం వస్తుందనిపించింది. కానీ, టెయిలెండర్ల వైఫల్యంతో చేజేతులా ప్రత్యర్థికి వికెట్లు ఇచ్చేసి పైచేయి సాధించే ఛాన్స్‌ను వదులకుంది. టీ సెషన్ తర్వాత వాషింగ్టన్ సుందర్(21 నాటౌట్)తో కలిసి కీలక భాగస్వామ్యం నెలకొల్పిన జడ్డూను వోక్స్ వెనక్కి పంపగా.. ఆ తర్వాత ఆకాశ్ దీప్‌ను కార్సే ఔట్ చేశాడు. చివరి వికెట్‌గా సుందర్ వెనుదిరగడంతో 387కే గిల్ సేన ఆలౌటయ్యింది. దాంతో, ఆధిక్యం సాధించాలనుకున్న భారత జట్టు స్కోర్ సమం చేసిందంతే.

లార్డ్స్‌లో భారత బ్యాటర్లు సమిష్టిగా రాణించారు. మూడో రోజు రిషభ్ పంత్(74), రెండో సెషన్‌లో కేఎల్ రాహుల్ (100) సెంచరీ తర్వాత ఔటైనా మరో వికెట్ పడకుండా జాగ్రత్త పడ్డారు. రాహుల్ వికెట్‌తో ఇండియాపై ఒత్తిడి పెంచాలనుకున్న బెన్ స్టోక్స్ సేన వ్యూహాల్ని నితీశ్ కుమార్ రెడ్డి(31)లు చిత్తు చేశారు. కొత్త బంతితో హడలెత్తించినా సరే సమయోచితంగా ఆడుతూ.. స్కోర్ 300 దాటించారు. వీళ్లిద్దరూ ఆరో వికెట్‌కు అజేయంగా 62 రన్స్ జోడించగా టీ బ్రేక్ సమయానికి ఇండియా 5 వికెట్ల నష్టానికి 316 పరుగులు చేసింది.

ఆ తర్వాత స్టోక్స్ ఓవర్లో నితీశ్ ఔట్ కాగా.. జడేజా ధనాధన్ ఆడి ఈ సిరీస్‌లో మూడో హాఫ్ సెంచరీ సాధించాడు. అనంతరం చిట్టచివరి బ్యాటర్ వాషింగ్టన్ సుందర్( నాటౌట్) అండతో జట్టుకు ఆధిక్యాన్ని అందించాలనుకున్నాడు జడేజా. కానీ, వోక్స్ బౌలింగ్‌లో లెగ్ సైడ్ ఆడిన జడ్డూ వికెట్ కీపర్ జేమీ స్మిత్ చేతికి దొరికాడు. సిక్సర్‌తో అలరించిన ఆకాశ్ దీప్(7)ను కార్సే ఔట్ చేసి నిమిదో వికెట్ అందించాడు. ఆ వెంటనే బుమ్రా, సుందర్‌లు పెవిలియన్ చేరడంతో టీమిండియాకు ఆధిక్యం సాధించే అవకాశం చేజారింది.



# పుష్పలో రష్మిక లాంటి రోల్స్ చేయాలని ఉంది

## కన్నడ నటి సప్తమీ గౌడ వెల్లడి

టాకీస్: కన్నడ నుంచి టాలీవుడ్‌కి అందాల భామలు వరుసగా ఎంట్రీ ఇస్తూనే ఉన్నారు. సౌందర్య తర్వాత ఆ ట్రెండ్ తగ్గలేదు. నటనతో, గ్లామర్‌తో ఆకట్టుకుంటూ ఇక్కడ తమ సత్తా చాటుతున్నారు. అనుష్కపూజాహెగ్డే రష్మిక మందన్న లాంటివారు ముందంజలో ఉండగా, పలు కొత్త హీరోయిలు కూడా టాలీవుడ్‌కి అడుగుపెడుతున్నారు. ఇటీవలి కాలంలో కన్నడ ఇండస్ట్రీ నుంచి పాన్ ఇండియా సినిమాలు వస్తుండటంతో, ఆ చిత్రాల్లో నటించిన హీరోయిన్లకు మిగతా భాషల నుంచి అవకాశాలు వెల్లువెత్తుతున్నాయి. ఇందులో భాగంగా 'కాంతార' ద్వారా సప్తమి గౌడ తెలుగు ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు సంపాదించుకుంది. అయితే 'కాంతార' లాంటి హిట్ అందుకున్న తర్వాత ఏ హీరోయిన్ అయినా వరుస సినిమాలతో ధూసుకు పోతారు కానీ.. సప్తమి మాత్రం 'కాంతార' తర్వాత ఎక్కువ సినిమాల్లో కనిపించలేదు. అయితే దీనికి స్పష్టమైన కారణం ఉన్నట్లు చెప్ప కొచ్చింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. ' 'కాంతార' తర్వాత అదే తరహా పాత్రలు నా ముందుకు వచ్చాయి. రొటీన్‌గా అవే పాత్రలు చేయడం ఇష్టం లేక మంచి పాత్రల కోసం వెయిట్ చేశాను. ముక్కు పుడకలు పెట్టుకోవడం.. గ్రామీణ యువతిగా కనిపించడం.. డైలాగ్స్ లేకపోవడం, సినిమాలో క్యారెక్టర్ సరిగా లేకపోవడం వల్ల నేను సినిమాలు ఒప్పుకోలేదు. మంచి పాత్రల కోసం వెయిట్ చేయడం వల్ల ఎక్కువ సినిమాల్లో నటించలేక పోయాను. మిగతా హీరోయిన్లతో నాకు స్క్రీన్ స్పేస్ లేదు.. ప్రజంట్ తెలుగులో మరో రెండు సినిమాల్లో నటిస్తున్నాను. మరిన్ని అవకాశాలు వస్తాయని నమ్ముతున్న. పుష్ప మూవీలో రష్మిక మందన్నకు దక్కిన లాంటి రోల్స్ వస్తే బాగుంటుందని వెయిట్ చేస్తున్నా' అని చెప్పారు.

# యానిమల్ లాంటి హీరోతో డేటింగ్

## నటి రష్మిక మందన్న హాట్‌కామెంట్స్



టాకీస్: వరుస సినిమాలతో అలరిస్తున్నారు నేషనల్ క్రష్ రష్మిక కెరీర్‌కు, 'యానిమల్' మూవీ ఎంతో విజయాన్ని అందించింది. అదే స్థాయిలో విమర్శలు కూడా వచ్చాయి. తాజాగా రష్మికను.. ఓ ఇంటర్వ్యూలో నిజ జీవితంలో యానిమల్ హీరో పాత్ర స్వభావం ఉన్న వ్యక్తితో మీరు డేటింగ్ చేస్తారా? అతడిలో మార్పు తీసుకురాగలరా? అని ప్రశ్న ఎదురవ్వగా .. ఆసక్తికర సమాధానమిచ్చింది రష్మిక. అలాంటి వ్యక్తితో డేటింగ్ చేయడానికి అభ్యంతరం లేదన్నారు. ప్రస్తుతం ఈ కామెంట్స్ చర్చనీయాంశంగా మారాయి. ఇదే ఇంటర్వ్యూలో ఆమె ప్రేమపై తన అభిప్రాయాన్ని కూడా పంచుకున్నారు. మనం ఎవరినైనా ప్రేమిస్తే.. మనల్ని ఎవరైనా ప్రేమిస్తే మార్పు కచ్చితంగా జరుగుతుందని నేను నమ్ముతాను. ఎందుకంటే భాగస్వామితో కలిసి ఉంటున్నప్పుడు వారితో కలిసి జీవితాన్ని పంచుకుంటున్నప్పుడు ఇద్దరి వ్యక్తిత్వాల్లో మార్పు వస్తుంది. ఒకరికి ఒకరు అభిప్రాయాలు పంచుకుంటారు. ఇష్టాయిష్టాలు తెలుసుకుంటారు. ఒకరి కోసం ఒకరు మారతారు. మీ ప్రాణ స్నేహితుడితో కాని, మీ భాగస్వామితోనే కాని కొంతకాలం కలిసి ప్రయాణించాక అకస్మాత్తుగా పాత రోజులను గుర్తుచేసుకుంటే వారి కోసం మీరు ఎంతలా మారారో అర్థమవుతుంది. ఆ మార్పునకు ఒక్కోసారి మీరే ఆశ్చర్యపోతారని చెప్పారు. తాను అర్థంచేసుకునే భాగస్వామి గురించి మాత్రమే మాట్లాడినట్లు తెలిపారు. ప్రస్తుతం రష్మిక వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. ఆయుష్మాన్ ఖురానాతో కలిసి 'థామా' అనే హారర్ కామెడీలో నటిస్తున్నారు. దీనితో పాటు 'ది గర్ల్ రైడ్‌తో సిద్ధమవుతున్నారు. తాజాగా 'మైసా' అనే చిత్రాన్ని కూడా ప్రకటించారు అలాగే అట్లీ- అల్లు అర్జున్ సినిమాలోనూ ఈ అమ్మడు కనిపించనున్నట్లు- వార్తలు వస్తున్నాయి.

# ఏఐ ఆధారంగా భగవద్గీత






## ఐదునిముషాల నిడివిలో పూర్తి

టాకీస్: ప్రస్తుతం భారత సినిమా ఇండస్ట్రీ పురాణాలు, ఇతిహాసాల ఆధారిత సినిమాలపై మక్కువ చూపుతున్నారు. వందల ఏళ్ల నాటి గ్రంథాల కథలు, శ్లోకాల గాథలు నేటి టెక్నాలజీతో ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికే 'అదిపురుష్', 'శాకుంతలం', 'హనుమాన్' లాంటి సినిమాలు రాగా.. తాజాగా బాలీవుడ్ నుండి 'రామాయణ' కూడా రెండు బాగాలుగా రాబోతుంది. ఇప్పటికే హోంబలే ఫిల్మ్ పురాణాల ఆధారంగా ఏడు సినిమాలు నిర్మించనున్నట్లు- అధికారికంగా ప్రకటించగా, ఈ నేపథ్యంలో దర్శకుడు రామ్ మాధ్వాని తాజాగా మరో సర్ప్రైజ్‌ను పంచుకున్నారు. ఏఐని ఉపయోగించి భగవద్గీతపై షార్ట్ ఫిల్మ్ రూపొందించినట్లు- చెప్పారు. రెండేళ్లు కష్టపడి దీన్ని అభివృద్ధి చేసినట్లు రామ్ మాధ్వానీ తెలిపారు. ఈ షార్ట్ ఫిల్మ్ కేవలం ఐదు నిమిషాల నిడివి ఉన్నప్పటికీ, అందులో గీతలోని 18 అధ్యాయాల సారాంశం చేయించినట్లు తెలిపారు. ఇప్పటికే ప్రైవేట్ ప్రివ్యూలలో ఈ చిత్రాన్ని ప్రదర్శించాగా.. 'వర్చువల్ రియాలిటీ ద్వారా మనం కథలోని పవిత్రతను పునరుద్ధరించవచ్చు. శతాబ్దాలుగా అందుబాటులో ఉన్న ఇతిహాసాల కంటే గొప్ప కథలు మరేం ఉండవు' అని రామ్ మాధ్వానీ చెప్పారు. తన లక్ష్యం కేవలం పౌరాణిక కథను చూపడం మాత్రమే కాదని, ప్రేక్షకులను ఆధ్యాత్మిక అనుభూతికి దగ్గర చేయడం అని స్పష్టం చేశారు. ఇలాంటి ప్రయత్నాలు కేవలం కథగా మాత్రమే కాదు, మన సంస్కృతి, తత్వాన్ని ఆధునిక ప్రపంచానికి పరిచయం చేస్తున్నాయి.

# పెద్ది నుంచి గౌర్నాయుడు లుక్ విడుదల



టాకీస్: గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'పెద్ది'. బుచ్చిబాబు సనా దర్శకత్వంలో, గ్రామీణ క్రీడల నేపథ్యంలో సాగే యాక్షన్ డ్రామాగా రూపొందుతున్న ఈ చిత్రాన్ని.. వెంకట సతీష్ కిలారు నిర్మించగా, మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా సమర్పిస్తున్నాయి. కాగా ఈ మూవీలో జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తుండగా, జగపతి బాబు, దివ్యేందు శర్మ కీలక పాత్రలో కనిపించనున్నారు. విజువల్ పరంగా సినిమాకి ప్రత్యేకంగా నిలిచేలా ఆర్. రత్నవేలు సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, సంగీతానికి ఎ.ఆర్. రెహమాన్ అందిస్తున్నారు. ఇక రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా 2026 మార్చి 27న ఈ చిత్రాన్ని విడుదల చేయాలని చిత్ర బృందం లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ గ్లింప్స్, ఫస్ట్ లుక్స్‌తో సినిమాపై అంచనాలు కూడా భాగా పెరిగిపోయ్యాయి. అయితే తాజాగా చిత్రబృదం నేడు సూపర్ స్టార్ శివరాజ్ కుమార్ పుట్టినరోజు సందర్భంగా, ఈ మూవీలో ఆయన పాత్రకు సంబంధించిన పవర్‌ఫుల్ ఫస్ట్ లుక్‌ను 'పెద్ది' చిత్ర బృందం విడుదల చేసింది. ఈ సందర్భంగా విడుదలైన శివరాజ్ కుమార్ ఫస్ట్ లుక్ సినిమాలోని అతని పాత్ర ఎంత బలమైనదో చూపించింది. మందపాటి హ్యాండిల్ బార్ మీసం, గంభీరమైన చూపుతో.. శివరాజ్ కుమార్ లుక్ అదిరిపోయింది. కాగా ఈ మూవీలో ఆయన 'గౌర్నాయుడు' పాత్రలో కనిపించనున్నారు.

# తెలుగులో విడుదలవుతున్న మై బేబీ

టాకీస్: తమిళ్‌లో ఇటీవల విడుదలై సూపర్ హిట్ అయిన 'డీఎన్ఏ' మూవీ ఎలాంటి హిట్ అందుకుందో తెలిసిందే. నెల్సన్ వెంకటేసన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ మూవీ ఇటీవలే విడుదలై విమర్శకుల ప్రశంసలు అందుకుంది. హాస్పిటల్స్‌లో పిల్లల్ని మాయం చెయ్యడం, వారిని వేరే చోట అమ్మేయడం వంటి వార్తలు చూస్తుంటాం. ఇలాంటి వార్తలు ఇప్పుడు కాదు కొన్ని సంవత్సరాలుగా వింటూనే ఉన్నాం. ఈ సినిమా మరొక్కసారి గా మనం సొసైటీలో ఎంత జాగ్రత్తగా ఉండాలో తెలియచేసింది. అధర్వ మురళి, నిమిషా సజయన్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ క్రైమ్ థ్రిల్లర్, భావోద్వేగ డ్రామాతో కూడిన గ్రిప్పింగ్ కథాంశంతో ఆకట్టు-కుంది. అయితే తమిళంలో విజయం సాధించిన మూవీ ఇప్పుడు తెలుగులో మై బేబీ పేరుతో ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రేమిస్తే, జర్నీ, షాపింగ్‌మాల్, పిజ్జా వంటి అనువాద హిట్స్‌ని తెలుగు ప్రేక్షకులకు అందించిన నిర్మాత సురేశ్ కొండేటి, ఇప్పుడు 'మై బేబీ' సినిమాను ఎస్.కె. పిక్చర్స్ బ్యానర్‌పై రిలీజ్ చేస్తున్నారు. రీసెంట్ గా తెలుగు సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ సినిమా జూలై 18, థియేటర్లలో విడుదల కానుంది. ఇక భావోద్వేగాలతో పాటు- థ్రిల్ కలగలిపిన స్క్రీన్‌ప్లే ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనుందని మేకర్స్ చెబుతున్నారు.



# లెనిన్ మూవీ నుంచి శ్రీలీల ఔట్



టాకీస్: అక్కినేని అఖిల్ నటిస్తున్న చిత్రం 'లెనిన్'. మురళీ కిషోర్ అబ్బూరు దర్శకత్వం వహిస్తున్న సినిమాను , అన్నపూర్ణ స్టూడియోస్, సితార ఎంటర్-టైన్‌మెంట్స్ బ్యానర్‌లపై ఈ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చిత్ర షూటింగ్ కూడా జరుగుతోంది. పలు పోస్టర్లను కూడా విడుదల చేసిన సంగతి అందరికీ తెలిసిందే. అయితే ఈ చిత్రంలో తొలుత టాలీవుడ్ యంగ్ సెన్సేషన్ శ్రీ లీలా ఎంపికైంది. తర్వాత ఏమైందో ఏమో కానీ ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పకుంది. శ్రీలీలను లెనిన్ చిత్రం నుంచి తప్పించిన తర్వాత మేకర్స్



షూటింగ్ పనులను మరింతగా వేగవంతం చేశారు. అయితే శ్రీలీలాతో ఇప్పటికే తీసిన ఓ 2 వారాల సీన్లను ఇప్పడు భాగ్యశ్రీ తో రీషూట్ చేయబోతున్నారని తెలుస్తోంది. శ్రీ లీలా తో తీసిన సీన్స్ అన్నింటిని మళ్లీ చిత్రీకరించ బోతున్నారు. దీంతో టీమ్‌కు మరింత పని భారం పడనుందని అంటున్నారు. కాగా భాగ్యశ్రీ జూలై 16 నుండి షూటింగ్ సెట్స్‌లో జాయిన్ అవుతున్నట్టు-.. సమాచారం. ఇక ఈ చిత్రానికి మ్యూజిక్ డైరెక్టర్‌గా థమన్ పనిచేస్తుండగా. మాస్ అప్పీల్, స్టైలిష్ కథనంతో అఖిల్ ఈసారి కచ్చితంగా హిట్ కొడతాడా? అన్నది ఆసక్తికరమైన అంశంగా మారింది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.